PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 38 | విజయవాడ, గురువారం 7 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 7 September 2023 | Rs

బిజెపిది అపరిపక్వ వైఖరి

- ప్రతిపక్ష కూటమి పేరు పెట్టడంతోనే ఇండియా పేరు మార్పు
- మీడియాతో సీతారాం ఏచూరి

లోపలి పేజీలో..

సెమీస్‌కు బొప్పన్న జోడీ

- సింగిల్స్‌లో జకోవిచ్, షెల్టన్ కూడా..
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

లోపలి పేజీలో

బిజెపిని బలపరచడం మానుకోండి

వైసిపి, టిడిపి, జనసేనలకు బి.వి రాఘవులు సూచన

సిపిఎం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం ప్రారంభం

రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై చర్చ

నవంబరు 7న విజయవాడలో భారీ బహిరంగ సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మతోన్మాద బిజెపిని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బలపరచడాన్ని మానుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు సూచించారు. వడ్డేశ్వరంలోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో రెండు రోజుల సిపిఎం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాలను రాఘవులు బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు పి.మధు ఆవిష్కరించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు జయరాం సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతినిధులు రెండు నిముషాలు మౌనం పాటించారు. అనంతరం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించడమే సిపిఎం ప్రధాన లక్ష్యమని అన్నారు. మోడీ అధికారంలోకి వస్తే దేశ భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా కలిసొచ్చే అన్ని వామపక్ష పార్టీలను కలుపుకుని దేశవ్యాప్తంగా విస్తృత పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే దేశంలో బిజెపి విచ్ఛిన్నకర రాజకీయాలను అనుసరిస్తూ

కులాలు, మతాలు, తెగల మధ్య వైషమ్యాలు పెంచుతోందన్నారు. మణిపూర్‌లో జాతుల మధ్య హింసను ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొట్టారన్నారు. బిజెపి విధానాలను తిప్పికొట్టేందుకు ప్రతిపక్షపార్టీలన్నీ ఇండియా పేరుతోరాజకీయ వేదికగా ఏర్పడ్డాయనిచెప్పారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజికన్యాయం, సమాఖ్యస్ఫూర్తి విషయంలో ఈ వేదికలోని పార్టీలు ఉమ్మడిగానే వ్యవహరిస్తున్నాయన్నారు. మరోవైపు బిజెపికి వరుస ఓటములు ఎదురవుతున్నాయని, కర్నాటకలో ఓటమితో బిజెపి ఆత్మవిశ్వాసం దెబ్బతిందన్నారు. బిజెపిని ఓడించడం ఏమంత కష్టం కాదని తేలిపోయిందన్నారు. దాన్నుండి బయటపడేందుకు అత్యవసర పార్లమెంటు సమావేశాలు, జమిలి ఎన్నికలు, జి20 సమావేశాల అంశాన్ని ముందు తెచ్చి తమకు అనుకూలంగా ప్రచారం చేయించుకుంటున్నారన్నారు. వీటితోపాటు మణిపూర్, ఢిల్లీ, హర్యానా, బీహార్, అస్సాం రాష్ట్రాల్లో మతోన్మాదదాడులను పెంచారన్నారు. వారణాసిలో

విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు, వేదికపై శ్రీనివాసరావు, గఫూర్, రమాదేవి తదితరులు

జ్ఞానవాపి మసీదు వివాదాన్ని రగిల్చారని, ఇవన్నీ భవిష్యత్ ప్రమాదాన్ని సూచిస్తున్నాయని చెప్పారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనూ ఏమి చర్చిస్తారనే విషయాన్ని బయటకు చెప్పడం లేదన్నారు. కార్పొరేట్ మీడియాను అడ్డుపెట్టుకుని తమకు అనుకూలంగా ప్రచారం చేయించుకుంటున్నారన్నారు. వీటిని అడ్డుకునేందుకు ఇండియా వేదికలో ఉన్న 28 పార్టీలు విస్తృతంగా చర్చిస్తున్నాయని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో వైఎస్‌ఆర్‌సిపి, టిడిపి, జనసేన వైఖరిలో మార్పులేకపోగా మరింత సన్నిహితమయ్యే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. జనసేన ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉందని, బిజెపిని బలపర్చే విషయంలో ఈ మూడు పార్టీల్లో పెద్దగా తేడా లేదని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సిపిఎంను బలోపేతం చేసుకునే దిశగా విస్తృత ప్రజా ఉద్యమాలు నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. బిజెపి వ్యతిరేక శక్తులను కూడగట్టేందుకు ప్రయత్నించాలని, పార్టీ స్వతంత్ర, ప్రజాపునాదిని మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సూచనలకు అనుగుణంగా బిజెపిని వ్యతిరేకించే పార్టీలు, సంస్థలు, వ్యక్తులను గుర్తించి వారితో ఐక్య కార్యాచరణ చేపట్టాలని అన్నారు.

పార్టీ స్వతంత్ర ప్రజాపునాదిపెంపుకోసం కృషి : వి.శ్రీనివాసరావు

రాష్ట్రంలో ప్రస్తుత ప్రజాసమస్యలు, ప్రజలపై భారాలు పెరిగిపోతున్నాయని, అవినీతి, అక్రమాలకు అంతే లేకుండా పోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. 2021 డిసెంబర్లో రాష్ట్ర మహాసభ అనంతరం జరిగిన అంశాలపై కార్యదర్శి నివేదికను ఆయన ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, దోపిడీ విధానాలపై పోరాడుతూ పార్టీ స్వతంత్ర ప్రజా పునాదిని బలపరుచుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం తొలి నుండీ నికరంగా ప్రజల కోసం పోరాడుతోందని తెలిపారు. ఇసుక అక్రమాలు, భూముల దోపిడీ తదితర అంశాల్లో రాజీలేని పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. స్కీం వర్కర్లకు జరుగుతున్న అన్యాయంపైనా, కార్మికులకు చేస్తున్న ద్రోహంపైనా పోరాడుతున్న పార్టీ సిపిఎం మాత్రమేనని అన్నారు. ఈ కృషిలో వామపక్ష పార్టీలతో సహా కలిసి వచ్చే ఇతర లౌకిక పార్టీలను కలుపుకుని పనిచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి టిడిపి రెండూ బిజెపికి వంతపాడుతున్నాయని, రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపి పల్లకి మోయడం దుర్మార్గమని విమర్శించారు. లౌకిక పార్టీ అని చెప్పుకునే పార్టీలు బిజెపి మిగతా 2లో

అజెండా ఏమిటో చెప్పాలి

- ఈ తొమ్మిది అంశాలను అందులో చేర్చాలి
- వీటిపై పార్లమెంటులో చర్చ జరగాలి
- ప్రత్యేక సమావేశాలపై ప్రధానికి సోనియా లేఖ

న్యూఢిల్లీ: ఈనెల 18 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు కేంద్రం పిలుపునివ్వటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలకు మోడీ ప్రభుత్వం ఎలాంటి అజెండానూ ప్రకటించలేదు. దీంతో ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ విషయం పైనే కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ స్పందించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల అజెండాను బయట పెట్టాలని కోరుతూ ఆమె బుధవారం ప్రధాని మోడీకి ఓ లేఖాస్త్రం సంధించారు. అజెండాలో తొమ్మిది అంశాలను చేర్చాలని పేర్కొన్నారు. అదానీ గ్రూప్‌పై తాజా ఆరోపణలు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఎంఎస్‌పీ పెంపు కోసం రైతుల డిమాండ్లు, మణిపూర్ పరిస్థితి, మతపరమైన ఉద్రిక్తతలు పెరగడం, కుల గణన ఆవశ్యకత, భారత భూభాగం మరియు కేంద్ర-రాష్ట్ర సంబంధాలు తొమ్మిది అంశాలనూ పార్లమెంట్ చర్చించాలని లేఖలో తెలిపారు. రాజకీయ పార్టీలను సంప్రదించకుండానే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల తేదీలను ప్రకటించారనీ, ఈ సమావేశాల అజెండా ఏమిటో మాకెవరికీ సమాచారం లేదని సోనియా పేర్కొన్నారు. పార్లమెంటులో అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలపై చర్చించడానికి ఇండియా వేదికలోని పలు పార్టీలు మంగళవారం సమావేశమైన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నివాసంలో ఆయన అధ్యక్షతన జరిగిన ఇండియా ఫోరం ఫ్లోర్ లీడర్స్ సమావేశంలో కాంగ్రెస్, డిఎంకె, సిపిఎం, ఎన్‌సిపి, సిపిఐ, ఆప్, టిఎంసి, ఆర్‌జెడి, ఎస్‌పి తదితర పార్టీలు పాల్గొన్నాయి. ఎలాంటి అజెండానూ ప్రకటించకుండానే మోడీ ప్రభుత్వం సమావేశాలను నిర్వహిస్తున్నదని మల్లిఖార్జున్ ఖర్గే విమర్శించారు. ఈ సమావేశాల్లో ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని భేటీ అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఈనెల 18 నుంచి 22 వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ ప్రత్యేక సమావేశాల్లో మోడీ సర్కారు కొన్ని వివాదాస్పద బిల్లులను తీసుకొచ్చే అవకాశమున్నదని రాజకీయ వర్గాల్లో ఇప్పటికే చర్చ నడుస్తున్నది. ఇందులో 'వన్ నేషన్-వన్ ఎలక్షన్', ఉమ్మడి పౌర స్మృతి(యూసిసి) అమలు, ఇండియా పేరు మార్పు వంటివి ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, ఇంత జరుగుతున్నా.. మోడీ ప్రభుత్వం నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాల విషయాల్లో ఎలాంటి అజెండా లేకపోవటం గమనార్హం.

మణిపూర్‌లో మళ్లీ హింస

- ఆర్మీ బారికేడ్‌పై మైతీ గుంపు దాడి
- 40 మందికి గాయాలు

2

నన్నూ అరెస్టు చేస్తారేమో..!

- రాష్ట్రంలో స్వేచ్ఛాయుత వాతావరణం లేదు
- ప్రశ్నించేవారిని వెంటాడుతున్నారు
- 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ'లో చంద్రబాబు

పల్లెప్రగతి కోసం ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'రాష్ట్రంలో ప్రశ్నించేవారినెవ్వరినీ వదిలిపెట్టడం లేదు.. వెంటాడుతున్నారు.. వేధిస్తున్నారు... నన్ను కూడా వదిలిపెట్టడం లేదు.. ఒకటి, రెండు రోజుల్లో నన్నూ అరెస్టు చేసినా చేస్తారు' అని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అన్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' యాత్ర అనంతపురం జిల్లాలో రెండోరోజైన బుధవారం రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో కొనసాగింది. తొలుత రాయదుర్గం పట్టణంలో 'పల్లెప్రగతి కోసం ప్రజావేదిక' అనే కార్యక్రమంలో నిర్వహించారు. ఇందులో యువత, మహిళలు, రైతులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, మేధావులతో సమావేశం నిర్వహించారు. రాయదుర్గం ప్రాంతంలో జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయన్న అంశాన్ని ఓ జర్నలిస్టు లేవనెత్తారు. స్పందించిన చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. వారికి ఎవరు వ్యతిరేకంగా నోరెత్తినా అణచివేసే చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయ, ఎన్‌జిఒ సంఘం నాయకులు కూడా మాట్లాడలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తాను ప్రాజెక్టుల యాత్ర చేపడితే పుంగనూరులో దాడి చేసి తనపైనే కేసులు నమోదు చేశారని చెప్పారు. ఇప్పుడు యువగళంపైనా దాడి చేస్తున్నారని తెలిపారు. ఇసుక రీచ్‌లో అక్రమాలను ప్రశ్నిస్తూ ఎన్‌జిటికి వెళితే 108 ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు ఆపాలని సుప్రీంకోర్టు సైతం ఆదేశించిందని గుర్తు చేశారు. దీనిపై న్యాయపోరాటం చేసిన వ్యక్తిని వదిలిపెట్టకుండా కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. ఒకటి, రెండు రోజుల్లో తనను అరెస్టు చేస్తారేమోనని తెలిపారు. ఇటువంటి వాటికి భయపడబోనని తెలిపారు. గతంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 26 కేసులు నమోదు చేసి ఏమి చేయగలిగారని ప్రశ్నించారు. అనంతరం కళ్యాణదుర్గం పట్టణంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో బిసి, ఎస్‌సిలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే బిసిల రక్షణకు రక్షణ చట్టాన్ని తీసుకొస్తానని హామీనిచ్చారు. తమ హయాంలో చేపట్టిన భైరవానితిప్ప ప్రాజెక్టు నిర్మాణం కోసం తెప్పించిన మోటార్లు సైతం తుప్పుబట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురువులను అవమానపరిచే విధంగా ఓ మంత్రి మాట్లాడటం శోచనీయమన్నారు. రాష్ట్రంలో నడుస్తున్నది అంతటా రివర్స్ పాలన అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే సిఎం జగన్ ఇంటికి పోవాల్సిందేనని తెలిపారు.

బాబు సెల్ఫీ ఛాలెంజ్

రాయదుర్గంలో ప్రజావేదిక కార్యక్రమం ముగించుకుని ఉరవకొండ మండలం కౌకుంట్లలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మిగతా 2లో

ఐటిలో భారీగా తగ్గిన నియామకాలు

- బీమా, ఆటో, వైద్య రంగాల్లోనూ పతనం
- ఆగస్టులో 6 శాతం క్షీణత
- నౌకరీ జాబ్ స్పీక్ ఇండెక్స్‌లో వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో ఉపాధి అవకాశాలు ఆవిరైపోతున్నాయి. డిమాండ్ ఉండే ఐటి రంగంలోనూ ఉద్యోగ నియామకాలు భారీగా తగ్గిపోతున్నాయి. బీమా, ఆటోమొబైల్, వైద్య రంగాల్లోనూ ఇదే పరిస్థితి. ప్రముఖ జాబ్ పోర్టల్ నౌకరీ డాట్ కామ్ సంస్థ ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. ఈ ఏడాది ఆగస్టులో ఆయా రంగాల నియామకాల్లో ఏకంగా 6 శాతం తగ్గుదల చోటు చేసుకుందని తెలిపింది. గతేడాది ఇదే నెలలోని ఐటి నియామకాలతో పోల్చితే.. గడిచిన ఆగస్టులో ఏకంగా 33 శాతం పడిపోయాయని నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్‌లో వెల్లడించింది. ఆ రిపోర్ట్ ప్రకారం.. "ఆయా రంగాల్లో గతేడాది ఆగస్టులో 2,828 ఉద్యోగాలు రాగా.. 2023 ఆగస్టులో ఈ సంఖ్య 2,666కు పడిపోయింది. జులైతో పోల్చితే 4 శాతం పెరిగాయి. ఐటి పరిశ్రమలో కొత్త ఉద్యోగాలు గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే 33 శాతం తగ్గాయి. బీమా, ఆటో, వైద్యం, బిపిఒ రంగాల్లో ఉద్యోగ కల్పన వరుసగా వరుసగా 19 శాతం, 14 శాతం, 12 శాతం, 10 శాతం క్షీణించింది. మరోవైపు నాన్‌టెక్నలాజీ రంగంలోని ఆయిల్ అండ్ గ్యాస్, హాస్పిటాలిటీ, ఫార్మా విభాగాల నియామకాల్లో వరుసగా 17 శాతం, 14 శాతం, 12 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. కాగా చమురు, గ్యాస్ రంగంలో అహ్మదాబాద్, ముంబయి, చెన్నయ్, హైదరాబాద్ నగరాల్లో ఉద్యోగాల కల్పన నిలకడగా ఉంది. ఐటి రంగంలో నియామకాలు తక్కువగా చోటు చేసుకున్నప్పటికీ కృత్రిమ మేధా (ఎఐ) నైపుణ్యాలు కలిగినవారికి మెరుగైన అవకాశాలు లభిస్తాయని నౌకరీ.కమ్ పేర్కొంది.

9న ఎయు స్నాతకోత్సవం

- అల్లూరి ఇంద్రకుమార్, కొలకలూరి ఇనాక్‌లకు గౌరవ డాక్టరేట్లు

లోపలి పేజీలో..

శ్రీవారి యాత్రికులకు చేతికర్రలు

- అలిపిరిలో పంపిణీ చేసిన టిటిడి చైర్మన్



పార్వతీపురంలో ముంపునకు గురైన బైపాస్ కాలనీ

పలు జిల్లాల్లో కుండపోత

- రేగిడి ఆమదాలవలసలో 13.8 సెంటీమీటర్ల వర్షపాతం
- బలహీనపడిన అల్పపీడనం
- దక్షిణ ఒరిస్సా, ఉత్తరాంధ్రలో ఉపరితల ఆవర్తనం
- మరో 24 గంటల పాటు వర్షాలు

లోపలి పేజీలో

ఏడుగురికి ప్రాణదానం

- స్ఫూర్తినిచ్చిన యువతి ఆశయం
- రోడ్డుప్రమాదంలో బ్రెయిన్‌డెడ్

కీర్తి

ప్రజాశక్తి - పిచ్చాటూరు

రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన యువతి ఏడుగురికి ప్రాణం పోశారు. శరీర భాగాలను దానం చేయాలన్న తన ఆశయానికి తల్లిదండ్రులు ముందుకు రావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. కళ్లు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీల దానంతో ఏడుగురికి ప్రాణం పోశారు. తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం రామాపురం దళితవాడకు చెందిన సంపత్‌కుమార్, అమ్ములు దంపతులకు ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. మొదటి కుమార్తె కీర్తి (20). డిగ్రీ అనంతరం చెన్నైలోని ఓ ప్రయివేట్ కాల్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. చెన్నై సమీపంలోని కరడి పుత్తూరులో తన స్నేహితుడి పెళ్లి వేడుకలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మరో స్నేహితుడు రాబర్ట్‌తో కలిసి ద్విచక్రవాహనంలో మంగళవారం సాయంత్రం పెళ్లికి బయలుదేరారు. కరడి పుత్తూరు వంతెన వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో వెనుక కూర్చున్న కీర్తి రోడ్డుపై పడిపోయారు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌డెడ్‌తో మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. అవయవదానం చేయాలని కీర్తి తల్లిదండ్రులను వైద్యులు కోరారు. తల్లిదండ్రులు అంగీకరించడంతో ఆస్పత్రిలో 'వాక్ ఆఫ్ హానర్' నిర్వహించారు. కళ్లు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలను దానం చేశారు. ఏడుగురికి ఈ అవయవాలను అమర్చనున్నట్లు వైద్యులు తెలిపారు. భౌతికకాయాన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సందర్శించి, నివాళు లర్పించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని యువతి కుటుంబసభ్యులకు భరోసానిచ్చారు. ఎవరైనా చనిపోతే శరీర భాగాలను దానం చేయాలని కీర్తి ఎప్పుడూ చెబుతూ ఉండేదని, ఆమె అభిప్రాయానికి గౌరవమించి అవయవదానానికి ఒప్పుకున్నామని యువతి తల్లిదండ్రులు తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆదోని

ఉరేసుకొని కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన కర్నూలు జిల్లా ఆదోనిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చిప్పగిరి మండలం గుమ్మనూరుకు చెందిన

సందీప్‌కుమార్ (38) 2012 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. ఆదోని డిఎస్‌పి ఆఫీసులో ఆయన కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌టిసి కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూమ్‌లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కూమార్తె ఉన్నారు. మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

ఉపాధ్యాయులకు క్షమాపణలు చెప్పాలి

- మంత్రి సురేష్ వ్యాఖ్యల పట్ల మండిపడ్డ ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

గురువుల కన్నా గూగుల్ మిన్న అని, గూగుల్‌లో ఎక్కువ మెటీరియల్ దొరుకుతుందన్న రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి ఆదిమూలపు సురేష్ వ్యాఖ్యల పట్ల ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మంత్రి వ్యాఖ్యలను ఫ్యాప్టో, యుటిఎఫ్, ఎపిటిఎఫ్ నాయకులు ఓ ప్రకటనలో ఖండించాయి. తక్షణమే ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, గురుపూజోత్సవం సందర్భంగా గురువుల సన్మాన కార్యక్రమంలో మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఉపాధ్యాయులపై ప్రభుత్వానికి ఎంత గౌరవం ఉందో తెలియజేస్తోందని ఫ్యాప్టో చైర్మన్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ సురేష్ పేర్కొన్నారు. ప్రతిరోజు అప్‌డేట్ అవుతూ, గూగుల్‌తో పాటు అత్యాధునిక టెక్నాలజీ వాడి, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో స్మార్ట్ టీవీలు, బైజూస్ ట్యాబ్‌లతో ఉపాధ్యాయులు పాఠాలు చెప్తున్న సంగతి మంత్రి గుర్తుంచుకోవాలన్నారు. ఐదో తేదీ వచ్చినప్పటికీ టీచర్స్‌కు జీతాలు చెల్లించలేని ప్రభుత్వం సిగ్గుపడాల్సింది పోయి, టీచర్స్ డే రోజు వారిని అవమానించడం విచారకరమని, ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ టెక్నాలజీ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదనే కనీస స్పృహ మున్సిపల్ శాఖ మంత్రికి లేకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. తన వ్యాఖ్యలను మంత్రి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఉపాధ్యాయులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గూగుల్ మానవుడు తయారు చేసిన ఒక సాధనం లాంటిదే తప్ప గురువుకు సాటి కాదని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి పేర్కొన్నారు. విద్య అంటే కేవలం పాఠాలు బోధించడం మాత్రమే కాదని, క్రమశిక్షణ, మానవ సంబంధాలు, నైతిక విలువలు మొదలగు అన్ని విలువలను ఉపాధ్యాయుల ద్వారా మాత్రమే విద్యార్థులు నేర్చుకుంటారని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ గ్రహించాలని సూచించారు.

ఆన్‌లైన్ ప్రత్యామ్నాయం కాదు : సాబ్జీ

ప్రత్యక్ష బోధనకు ఆన్‌లైన్ విద్యాబోధన ప్రత్యామ్నాయం కాదన్న విషయాన్ని మంత్రి సురేష్ తెలుసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని యునెస్కో నివేదికలో స్పష్టం చేసిందన్న విషయం మంత్రికి తెలియకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థి నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి, సృజనాత్మకత, పెద్దల పట్ల వినయ విధేయతలు, సమాజ అవగాహన, ఉత్తమ పౌరునిగా తీర్చిదిద్దడం గురువు ద్వారా మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు.

పలు జిల్లాల్లో కుండపోత

- రేగిడి ఆమదాలవలసలో 13.8 సెంటీమీటర్ల వర్షపాతం
- బలహీనపడిన అల్పపీడనం
- దక్షిణ ఒరిస్సా, ఉత్తరాంధ్రలో ఉపరితల ఆవర్తనం
- మరో 24 గంటల పాటు వర్షాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం కుండపోత వర్షాలు కురిశాయి. అత్యధికంగా విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలసలో 13.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం విజయరామపురంలో 12.9 సెంటీమీటర్లు, మెళియాపుట్టిలో 9.5, పలాసలో 9.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 8.4 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పార్వతీపురంలో ఏకధాటిగా నాలుగు గంటల పాటు వర్షం కురవడంతో బైపాస్ కాలనీ, సౌందర్య థియేటర్ కాలనీ, నందమూరి కాలనీ, భారతీ నగర్, దేవీనగర్‌తో పాటు పలు కాలనీల్లో భారీగా వర్షం నీరు చేరింది. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. సీతంపేట ఏజెన్సీలో కురిసిన భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. మక్కువ, వీరఘట్టం మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. వెంగళరాయసాగర్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి సుమారు 600 క్యూసెక్కుల నీటిని గోముఖి నదిలోకి విడుదల చేసినట్లు ప్రాజెక్ట్ ఎఇఇ ప్రశాంత్ తెలిపారు. విజయనగరం జిల్లాలో బొబ్బిలి, తెర్లాం, బాడంగి మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. స్థానిక పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం గెడ్డ ఉప్పొంగి ప్రవహించింది. ఈ జలపాతాన్ని తిలకించడానికి వచ్చిన పర్యాటకులు వర్షం కారణంగా నిరాశతో వెనుదిరిగారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో భారీ వర్షం కురిసింది. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో 6.9 సెంటీమీటర్లు, చందర్లపాడులో 3.4, వత్సవాయిలో 3.6, నందిగామలో 3.2. పెనుగంచిప్రోలులో 3.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విజయవాడ నగరంలోనూ భారీ వర్షం కురిసింది. కృష్ణా జిల్లాలో మోస్తరు వర్షాలు కురిశాయి. ఏలూరు జిల్లా ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ముసునూరులోని రజకులపేట వద్ద డ్రెయినేజీ పూడుకుపోవడంతో వర్షపు నీరు, మురుగునీరు ఇళ్లల్లోకి చేరింది. దీంతో, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముదినేపల్లిలో ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని పలు గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురవడంతో పలు రహదారులతోపాటు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడా జల్లులు పడ్డాయి.

బుధవారం నాటికి అల్పపీడన ప్రాంతం బలహీనపడినప్పటికీ అదే ప్రాంతంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడడంతో వచ్చే 24 గంటల్లో రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, ఒడిశాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రుతుపవన ద్రోణి రాయపూర్, మన్నాలా, బికనీర్, కళింగపట్నం నుంచి ఆగ్నేయ దిశగా వాయువ్య పరిసర ప్రాంతాలు అంటే పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్రమట్టానికి 2.1 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని తెలిపారు. ఉత్తర కోస్తాలో కూడా రాగల 24 గంటల్లో రెండు మూడు చోట్ల భారీగా, దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

విజయవాడలో నిల్చిపోయిన వర్షపు నీరు

అక్టోబర్ 3 న కోర్టుకు హాజరుకండి

- అగ్రిగోల్డు ప్రతినిధులకు సమన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అగ్రిగోల్డ్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఛార్జిషీట్ దాఖలు చేసింది. అగ్రిగోల్డ్ ప్రమోటర్లు ఎవి రామారావు, శేషునారాయణరావు, హేమసుందర వరప్రసాద్ పేర్లను ఛార్జిషీట్‌లో చేర్చింది. అగ్రిగోల్డ్ ఫామ్ ఎస్టేట్స్ సహా 11 అనుబంధ కంపెనీలపై ఇడి ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఇడి దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను నాంపల్లి మెట్రొపాలిటన్ స్పెషల్ కోర్టు విచారణకు స్వీకరించింది. అక్టోబరు 3న కోర్టుకు హాజరుకావాలని అగ్రిగోల్డ్ ప్రమోటర్లు, కంపెనీల ప్రతినిధులకు కోర్టు సమన్లు జారీ చేసింది. 32 లక్షల మంది డిపాజిటర్లను రూ.6,380 కోట్ల మేర మోసం చేసినట్లు అగ్రిగోల్డ్‌పై అభియోగాలు దాఖలయ్యాయి. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే రూ.4,141 కోట్ల మేర ఆస్తులను ఇడి అటాచ్ చేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

స్వామినాథన్ అవార్డు అందుకున్న విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్‌కు స్వామినాథన్ పర్యావరణ పరిరక్షణ అవార్డు-2023 లభించింది. చెన్నైలో మద్రాస్ ఈస్ట్ రోటరీ క్లబ్ బుధవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డును ఆయన అందుకున్నారు. డిఎంకె ఎంపి కనిమొళి కరుణానిధి ముఖ్యఅతిథిగా హాజరై అవార్డును విజయ్‌కుమార్‌కు అందించారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహం చేస్తున్నందుకు ఈ అవార్డు దక్కిందని రైతు సాధికార సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది.

దమనకాండతో యువగళాన్ని అడ్డుకోలేరు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి నేత లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రను దమనకాండతో అడ్డుకోలేరని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీరు రాజ్యాంగ వ్యతిరేకమని బుధవారం ఒక ప్రకటనలో ఆయన ఆరోపించారు. 'యువగళం'లో పాల్గొంటున్నవారిపై దాడి చేయడమే కాకుండా తిరిగి టిడిపి వారిపైనే అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడం జగన్ 'సైకో' వైఖరికి అద్దం పడుతోందని అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్రకు లభిస్తున్న ఆదరణను ఓర్వలేకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. లండన్ పర్యటనలో ఉన్నప్పటికీ జగన్‌కు 'యువగళమే' గుర్తుస్తోందని పేర్కొన్నారు. వైసిపి సాగిస్తున్న దమనకాండకు స్వస్తి పలికే రోజు త్వరలోనే ఉందని పేర్కొన్నారు. పాదయాత్రలో అక్రమంగా ప్రవేశించిన వైసిపి కార్యకర్తలను పోలీసులు ఎందుకు అడ్డుకోవడం లేదని టిడిపి నేత ధూళిపాళ్ల నరేంద్ర మరో ప్రకటనలో ప్రశ్నించారు.

డిజిపికి ఫిర్యాదు

'యువగళం' యాత్రపై వైసిపి కార్యకర్తలు దాడి చేశారంటూ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, బొండా ఉమామహేశ్వరరావు, నక్కా ఆనంద్ బాబు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థ రోజురోజుకీ నవ్వులపాలవుతోందని ఆరోపించారు. భీమవరంలో యువగళం యాత్రకు పోలీసులు అనుమతి ఇచ్చిన రూట్‌లో వైసిపి నేతలు ఫ్లెక్సీలు ఎలా కడతారని ప్రశ్నించారు. ఫ్లెక్సీలు తీసేయాలని అడిగినందుకు తమ పార్టీ వారిపై రాళ్లు రువ్వారని పేర్కొన్నారు. పాదయాత్ర అడ్డుకోవాలనుకుంటున్న వైసిపి కుట్రలు సాగవన్నారు. ఇక నుంచి అయినా యువగళం యాత్ర సజావుగా జరిగేలా చూడాలని కోరారు.

ఆయేషామీరా కేసులో ముగిసిన విచారణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 15 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసులో సాక్షుల విచారణను సిబిఐ ముగించింది. బుధవారం విజయవాడలోని సిబిఐ క్యాంపు కార్యాలయంలో సిబిఐ ఎఎస్‌పి సిఆర్ దాస్ బందం ఈ హత్యకేసులోని సాక్షులను విచారించింది. ఆయేషా మీరా కేసు న్యాయవాది, సాక్షి అయిన వెంకట క్రిష్ణ ప్రసాద్ సిబిఐ విచారణకు హాజరయ్యారు. సిబిఐ విచారణ అనంతరం వెంకట క్రిష్ణ మీడియాతో మాట్లాడారు. హత్య జరిగిన తరువాత ఏ సమయానికి తాను హాజరు అయ్యారో ఆ విషయాలను సిబిఐ అధికారులు ఆరా తీశారని వెంకట క్రిష్ణ తెలిపారు. ఆయేషా మీరా హత్య జరిగిన తరువాత తానే స్వయంగా ఇంక్వేస్ట్ రిపోర్ట్ రాసినట్లు పేర్కొన్నారు. మతదేహంపై గాయాలు ఉన్నాయా? అని అధికారులు విచారించారని పేర్కొన్నారు. ఈ సంఘటన జరిగిన సమయంలో వున్న అధికారులు గురించి కూడా సిబిఐ అధికారులు అడిగారని తెలిపారు. ఆయేషా మీరా కుటుంబ సభ్యులతో తనకు ఉన్న పరిచయాల గురించి కూడా వాకాబు చేశారన్నారు. ఈ కేసులో నిధితులను అరెస్టు చేయాలని విచారణకు వచ్చిన ప్రతిసారీ అడుగుతున్నట్లు ఆయన తెలిపారు. 'విచారణ చేస్తున్నాం అని చెప్తున్నారే తప్ప అరెస్ట్ చేసిన పరిస్థితులు లేవు' అని ఆయన వాపోయారు. 'హత్య జరిగి 15 ఏళ్లు అవుతోంది. న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సిబిఐ విచారణతో న్యాయం జరగుతుందనే భావిస్తున్నాం' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇదే చివరికి అవకాశం

- మరోమారు వాయిదా కుదరదు
- మాజీ మంత్రి నారాయణకు హైకోర్టు స్పష్టీకరణ

ప్రజాశక్తి, అమరావతి

రాజధాని అమరావతి ప్రాంతంలో అసైన్డ్ భూముల కొనుగోలు ఆరోపణలతో మాజీ మంత్రి నారాయణ, ఇతరులపై 2020లో సీఐడీ పెట్టిన కేసులో పలుసార్లు వాయిదాలు కోరడంపై హైకోర్టు తీవ్ర అసంతప్తిని వ్యక్తం చేసింది. పీటిషనర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ లాయర్ సిద్ధార్థ లూథ్ర వ్యక్తిగత కారణాల వల్ల విచారణకు హాజరు కాలేకపోయారని మరో లాయర్ చెప్పడంపై హైకోర్టు తప్పుపట్టింది. పిటిషనర్ వాయిదా కోరడంపై సీఐడీ తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌టరడ్డి అభ్యంతరం చెప్పారు. ఇదే కారణంతో అనేకసార్లు వాయిదాలు కోరారని చెప్పారు. ఇదే చివరి అవకాశమని, మరోసారి వాయిదా కోరితే ఉపేక్షించబోమని న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి చెప్పారు. ఒకే వ్యవహారంపై క్వాష్ పిటిషన్ బెయిల్ పిటిషన్ ఎలా వేస్తారని పిటిషనర్‌ను ప్రశ్నించారు. అమరావతి ఏరియాలో అసైన్డ్ భూముల కొనుగోలుపై పెదపాలెం గ్రామస్తుడు యల్లమాటి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ 2020లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, రవికిరణ్ ఇచ్చిన మరో కేసును నారాయణ సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఈ నెల 14కి వాయిదా వేశారు.

ఏలూరు కలెక్టర్‌పై చర్యలకు లోకాయుక్త ఉత్తర్వులు

ప్రజాశక్తి- ఉయ్యూరు

మచిలీపట్నంలో జరిగిన కృష్ణా జిల్లా సర్వసభ్య సమావేశానికి హాజరు కాని ఏలూరు జిల్లా కలెక్టర్ శ్రీ వి.ప్రసన్న వెంకటేష్‌పై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్‌ను రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త పైమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కృష్ణా జిల్లాలో ఉండి ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉన్న కైకలూరు, ముదినేపల్లి, నూజివీడు తదితర మండలాల్లోని ప్రజా సమస్యలపై తగిన సమాధానాన్ని జిల్లా పరిషత్ సమావేశంలో చెప్పేవారే లేరని, సమావేశానికి ఏలూరు జిల్లా కలెక్టర్ హాజరు కాకపోవడంపై మాజీ మంత్రి, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) తన అసహనాన్ని సమావేశంలో వ్యక్తం చేయడం చేశారు. కృష్ణా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కృష్ణా జిల్లా, ఎన్‌టిఆర్ జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతున్నా ఉద్దేశ్యపూర్వకంగా ఏలూరు జిల్లా కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్, ఇతర ఉన్నతాధికారులు హాజరు కాలేదని రాష్ట్ర లోకాయుక్తకు ఆయన ఫిర్యాదు చేశారు.

విస్తృత స్థాయి సమావేశాల ప్రారంభ సూచికగా ఎర్రజెండా ఆవిష్కరిస్తున్న పెనుమల్లి మధు, చిత్రంలో బివి రాఘవులు, వి శ్రీనివాసరావు, ఇతర నేతలు

అయ్యన్నకు తాత్కాలిక ఊరట

ప్రజాశక్తి, అమరావతి

కష్ణా జిల్లా ఆత్కూర్ పోలీసులు నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి, టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడికి హైకోర్టులో ఊరట లభించింది. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం నిందితులకు 41ఎ నోటీసులు ఇచ్చాకే విచారణచేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కె.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం జగన్ ఇతర ప్రజాప్రతినిధులపై అయ్యన్న అనుచితంగా మాట్లాడారని వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్కూర్ పోలీసులు పెట్టిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు తొందపాటు చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరగా, స్పందించిన న్యాయమూర్తి, బెయిల్‌పిటిషన్ వేసుకోవాలని సూచన చేశారు.

బిజెపిని బలపరచడం మానుకోండి

(మొదటి పేజీ తరువాయి)

మతోన్మాదాన్ని ఎలా బలపరుస్తాయని ప్రశ్నించారు. వీరి వైఖరి దళితులకు, ఆదివాసీలకు మహిళలకు మైనార్టీలకు హాని చేస్తుందని తెలిపారు. మరోవైపు వైసిపి, తెలుగుదేశం పార్టీలు పరస్పరం వ్యక్తిగత విమర్శలకు పరిమితమయ్యాయని విమర్శించారు. రెండు పార్టీల నాయకులు పరస్పర దూషణలకు, బూతులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజా సమస్యలపై నోరెత్తడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో దుర్భిక్షం పెరిగిందని అన్నారు. లోటువర్షపాతం వల్ల 14 జిల్లాల్లో 416 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, సాధారణసాగు 85.97 లక్షల ఎకరాలు కాగా ఆగస్టు నాటికి 47.90 లక్షల ఎకరాలు మాత్రమే సాగు అయిందని తెలిపారు. అసైన్ట్ చట్టసవరణ చేశారని, ఇది అన్యాక్రాంతమైన భూములకు చట్టబద్ధత కల్పించడమేనని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం పెరుగుతోందని అన్నారు. దీన్ని అధిగమించేందుకు యూనిట్ రూ.9.10 పైసలు చొప్పున కొనుగోలు చేస్తోందని తెలిపారు. విద్యుత్ ధరలు పెరిగిపోవడం వల్ల అనేక పరిశ్రమలు నష్టాలపాలు అవుతున్నాయని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతవేసుకునే పరిస్థితి వస్తోందని తెలిపారు. ఉజ్వల గ్యాస్ పథకం ఐదు లక్షల మందికి వర్తింపజేశారని, అందరికీ వర్తింపజేయాలని అన్నారు. భవన నిర్మాణ రంగం దెబ్బతిందని, చేనేత రక్షణ కోసం పట్టు, నూలుపై జిఎస్‌టి ఎత్తివేయాలని అన్నారు. విశాఖ స్టీలు ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకునేందుకు పెద్దఎత్తున పోరాడుతున్నామని తెలిపారు. విద్యావైద్య రంగాల ప్రైవేటీకరణ విధానాల దుష్పలితాలు కనబడుతున్నాయని అన్నారు. స్థానికత పేరుతో నాలుగు జోన్లను ఆరుజోన్లుగా మార్చారని, ఏజెన్సీని వేర్వేరు జోన్లలో కలపడం వల్ల సమస్యలు వస్తున్నాయని తెలిపారు.

నవంబరు 7న భారీ బహిరంగ సభ

ప్రజాసంక్షేమం, అసమానతలు లేని అభివృద్ధి సామాజికన్యాయం అనే అంశాలపై సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం, సభలతోపాటు మూడు రాజకీయ జాతాలను అక్టోబరు 21 నుండి నవంబరు మూడోతేదీ వరకూ నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. వీటి ముగింపు సందర్భంగా నవంబరు 7వ తేదీన విజయవాడలో భారీ బహిరంగసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. అలాగే వ్యవసాయ సంక్షోభం, దళితులపై అత్యాచారాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజన అభివృద్ధి, ప్రభుత్వ రంగ పరిరక్షణ, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం, మహిళల భద్రత, ఉపాధి తదితర అంశాలపై వేర్వేరు ప్రాంతాల్లో రాష్ట్ర సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తొలుత విస్తృత సమావేశ నిర్వహణకు పలు కమిటీలను పార్టీ రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రతిపాదించారు. అధ్యక్షవర్గంగా ఎం.ఎ.గఫూర్, కె.లోకనాధం, డి.రమాదేవి, బి.కిరణ్, తీర్మానాల కమిటీ సభ్యులుగా మంతెన సీతారాం, వి.రాంభూపాల్, దడాల సుబ్బారావు, బి.గంగారావు, ఎ.అశోక్, మినిట్స్ కమిటీ సభ్యులుగా కె.ధనలక్ష్మి, టి.అరుణ్, కె.మురళి, వై.రాము వ్యవహరిస్తున్నారు.

టిటిడి మెంబర్లపై పిల్.. ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

ప్రజాశక్తి, అమరావతి

క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న వారిని తిరుమల తిరుపతి దేవస్థానాల (టిటిడి) పాలక మండలి సభ్యులుగా నియమించడాన్ని సవాల్ చేసిన కేసులో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది. జగ్గయ్యపేట వైసిపి ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను, ఢిల్లీ లిక్కర్ స్కామ్ నిందితుడు అరబిందో గ్రూప్ డైరెక్టర్ పి.శరత్‌చంద్రారెడ్డి, అవినీతి ఆరోపణలతో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ పదవిని కోల్పోయిన డాక్టర్ కేతన్ దేశాయ్‌లను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆగస్ట్ 25న జీవో 106ను జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన రిటైర్డు రైల్వే ఉద్యోగి చింతా వెంకటేశ్వరుడు పిల్ దాఖలు చేశారు. దీనిని న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం టీటీడీలు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలంది. విచారణను ఈనెల 13వ తేదీకి వాయిదా వేసింది.

దీక్షలో కూర్చున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

విశాఖ ఉక్కు జోలికొస్తే అదానీకి పట్టిన గతే...

- పోరాట కమిటీ హెచ్చరిక

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖ)

విశాఖ ఉక్కుపై కన్ను పడినందుకే అదానీ పతనం ప్రారంభమైందని, ఈ దేశంలో మోడీకి అండగా నిలిచిన రాజకీయ పార్టీలూ అధోగతి పాలవ్వక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ హెచ్చరించింది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 937వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కన్‌స్ట్రక్షన్, ట్రాఫిక్, ఆర్ఎండి కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, సిహెచ్.సన్యాసిరావు, అప్పలరాజు, గుమ్మడి నరేంద్ర మాట్లాడుతూ.. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టి, ప్రజల ఆస్తి అయిన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకోవడానికి ప్రభుత్వాలు యత్నించడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగా స్టీల్ యాజమాన్యం ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గించిందని, కొన్ని విభాగాలు మూసివేసి నష్టాల వైపు నడుపుతుందని, ఇది దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఒక పక్క కార్మికుల ప్రయోజనాలు దెబ్బతీస్తూ, ప్రమోషన్లు కల్పించకుండా అనేక అవరోధాలు కల్పిస్తోందని తెలిపారు. పూర్తిస్థాయి ఉత్పత్తి దిశగా కంపెనీని నడిపించాలని, గనులు కేటాయించాలని, విస్తరణ కోసం చేసిన అప్పులను మాఫీ చేయాలని, రెండేళ్లుగా నిలిపివేసిన ఉద్యోగ నియామకాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.హరినాథ్, ఎస్.ఈశ్వరరావు, పి.అప్పారావు, ఆర్.శ్రీనివాసరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

- ఆర్మీ బారికేడ్‌పై మైతీ గుంపు దాడి
- 40 మందికి గాయాలు

ఇంఫాల్ : మణిపూర్‌లో మళ్లీ హింస రాజుకుంది. కర్ఫ్యూను ఉల్లంఘించి మరీ... ఆర్మీ బారికేడ్‌ను తొలగించేందుకు మైతీలు బుధవారం ప్రయత్నించారు. కొందరు సాయుధ దుండగులు కాల్పులు జరపగా, ఒక గుంపు రాళ్లు రువ్వింది. దీంతో ఆర్మీ బలగాలు టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించడంతో జరిగిన తొక్కిసలాటలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌కు చెందిన ముగ్గురు జవాన్లు, మహిళలుసహా మరో 40 మంది ఆందోళనకారులు గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మణిపూర్ రాజధాని ఇంఫాల్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న బిష్ణుపూర్ జిల్లా ఫౌగాక్‌చావో ఇఖాయ్, క్వాక్తా వద్ద రెండు కిలోమీటర్ల పరిధిలోని రెండు ప్రదేశాల్లో సుమారు 10 వేల మంది మైతీలు ఆందోళన చేశారు. బిష్ణుపూర్- చురచంద్‌పూర్ సరిహద్దుల్లో బారికేడ్‌ను తొలగించాలని మైతీ గ్రూపులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. మణిపూర్ ఇంటిగ్రిటీ కో-ఆర్డినేషన్ కమిటీ (కొకొమి) పిలుపు మేరకు పది వేల మంది వరకూ చురచంద్‌పూర్ చేరుకున్నారు. ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో రోజంతా కర్ఫ్యూ విధించినప్పటికీ వేలాదిమంది కవాతుగా ఆర్మీ బారికేడ్ వద్దకు చేరుకున్నారు. క్వాక్టా వద్ద కేంద్ర భద్రతా బలగాలు వారిని ఆపడంతో ఆ గుంపు రాళ్లు రువ్వింది. గుంపును చెదరగొట్టడానికి టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించగా తొక్కిసలాటలో మహిళలతోసహా కొందరు గాయపడ్డారని రక్షణ వర్గాలు తెలిపాయి. సాయుధ దుండగులు కొందరు పోలీసుల వేషంలో వచ్చారని, ఆటో మెటిక్ గన్‌లతో భద్రతాబలగాలపై కాల్పులు జరిపారని సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు.

నన్నూ అరెస్టు చేస్తారేమో..!

(మొదటి పేజీ తరువాయి)

కుమారుడి వివాహ రిసెప్షన్‌కు చంద్రబాబు హాజరయ్యారు.కళ్యాణదుర్గంలో జరిగే బహిరంగ సభకు వెళ్లే క్రమంలో మార్గమధ్యంలో హంద్రీనీవా కాలువ, గాలిమరలున్న చోట సెల్ఫీఛాలెంజ్ దిగారు. తమ హయాంలో అనంతపురం జిల్లాలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించి ఇక్కడ గాలి, సౌర విద్యుత్ పరిశ్రమలను పెద్దఎత్తున ఏర్పాటు చేశామని చెప్పారు. అదే విధంగా బిందు, తుంపర సేద్యం, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు తాము చేపడితే వాటిని మధ్యలోనే నిలిపివేశారని విమర్శించారు.

అరెస్ట్ భయంతో రాద్ధాంతం: సజ్జల

ఐటి ఇచ్చిన నోటీసులకు సమాధానం చెప్పాల్సింది పోయి తనను రెండు, మూడు రోజుల్లో అరెస్ట్ చేస్తారంటూ చంద్రబాబునాయుడు రాద్ధాంత చేస్తున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. చంద్రబాబునాయుడు తనకు తాను నిప్పునని చెప్పుకుంటాడని ఈ నోటీసులతో నిప్పుకాదు తుప్పు అని తేలిపోయిందన్నారు. ఈ పాటికే ఇడి విచారణను పూర్తి చేసి అరెస్ట్ చేయాల్సిందని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని తన కార్యాలయం బుధవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు రూ.118 కోట్లు ముడుపులు తీసుకున్నట్లు వెలుగులోకి తెచ్చింది వైసిపి కాదని ఐటి శాఖ అని అన్నారు. ప్రజాధనం లూటీని సాధారణం అంశంగా చూస్తున్న పురంధేశ్వరి తీరు చూస్తుంటే మరిదిని రక్షించాలన్న ఆమె తాపత్రయం బయటపడిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించి సానుభూతి పొందాలనేది చంద్రబాబు కుట్రగా ఉందని అన్నారు. జమిలీ ఎన్నికలు, ఇండియాను భారత్‌గా మార్చే అంశంపై పార్టీ అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందిస్తారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వన్ నేషన్ ..వన్ ఎలక్షన్ అనేది మొదట్లోనే జరిగాయని గుర్తు చేశారు. ఇండియా పేరును భారత్‌గా మార్చడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదనేది తన అభిప్రాయమని అన్నారు.

BGR ENERGY SYSTEMS LIMITED
CIN: L40106AP1985PLC005318
Registered Office: Plot No A5,Pannamgadu Industrial Estate, Ramapuram Post,Sullurpet, Nellore District, AP - 524401
Website: www.bgrcorp.com
E.Mail ID: investors@bgrenergy.com

The 37th **Annual General Meeting (AGM)** of the shareholders of the Company is scheduled to be held on Friday, September 29, 2023 at 12.30 P.M (IST) through Video Conferencing (VC) and Other Audio Visual Means (OAVM) without the physical presence of the Members at a common venue in compliance with the applicable provisions of the Companies Act, 2013 read with Rules framed thereunder and in line with the **General Circular Nos. 10/2022 dated December 28, 2022 read with Circular Nos 14/2020 dated April 8, 2020, 17/2020 dated April 13, 2020, 22/2020 dated June 15, 2020, 33/2020 dated September 28, 2020, 39/2020 dated December 31, 2020, 02/2021 dated January 13, 2021, 10/2021 dated June 23, 2021, 21/2021 dated December 14, 2021 and 03/2022 dated May 5,2022 and December 28, 2022 (collectively referred as "MCA Circulars")**

The Notice calling the 37th AGM (Notice) and the Annual Report for the Financial Year 2022-2023 (Annual Report) will be sent only by e-mail to all those members, whose e-mail addresses are registered with the Company or with their respective Depository Participant (Depository), in accordance with the above referred MCA Circulars and the SEBI Circular No. SEBI/HO/CFD/PoD-2/P/CIR/2023/4 dated January 5, 2023. Members can join and participate in the 37th AGM through VC/ OAVM facility only. The instruction for joining the 37th AGM and the manner of participation in the remote electronic voting or casting vote through the electronic voting system including registration as a speaker during the 37th AGM are provided in the Notice. Members participating through the VC/OAVM facility shall be counted for the purpose of reckoning the quorum under Section 103 of the Companies Act, 2013. The Notice and the Annual Report will also be available on the website of the Company, **(www.bgrcorp.com)**, BSE Ltd **(www.bseindia.com)** and National Stock Exchange of India Ltd: **(www.nseindia.com)** and on the website of NSDL: **https://www.evoting.nsdl.com/public/Downloads.aspx.**

Members holding shares in physical/demat form who have not registered their e-mail addresses can get the same registered with the Company/Depository respectively and obtain the Notice of the 37th AGM, Annual Report and/or login details for joining the 37th AGM through the VC/OAVM facility including e-voting, by sending an e-mail to Link Intime India Private Limited, Registrar and Share Transfer Agent of the Company's at **rnt.helpdesk@linkintime.co.in** with a copy to the Companies e-mail address at **investors@bgrenergy.com.**

This information is being conveyed for the benefit of all Members of the Company and is in compliance with the aforesaid MCA and SEBI Circulars.

Place: Chennai
Date: 06/09/2023

For BGR ENERGY SYSTEMS LIMITED
Sd/-
S.Krishna Kumar
President & Company Secretary

అదానీ కంపెనీల్లోని విదేశీ ఇన్వెస్టర్ల అదృశ్యం

- మారిషస్ నుంచి ఆరు మాయం
- సెబీకి సవాల్

న్యూఢిల్లీ : అదానీ కంపెనీల్లో డొల్ల సంస్థల పెట్టుబడులు మరోమారు నిరూపేతమయ్యాయి. అదానీ లిస్టెడ్ కంపెనీల్లో షేర్లను కొనుగోలు చేస్తూ.. కృత్రిమ ధరల పెంపునకు పాల్పడుతోన్న విదేశాల్లోని ఇన్వెస్టర్లు అదృశ్యమయ్యారు. అదానీ సంస్థలలో షేర్లను కొనుగోలు చేస్తోన్న ఎనిమిది విదేశీ ఫండ్‌లలో ఆరు సంస్థలు మాయమయ్యాయని మింట్ ఓ కథనంలో వెల్లడించింది. ఇందులో బెర్ముడా, మారిషస్ ఫండ్ సంస్థలున్నాయి. గతేడాది మారిషస్ ఆధారిత రెండు సంస్థలు మూత పడ్డాయి. మూడోది మూసివేసే ప్రక్రియలో ఉందని మిట్ రిపోర్ట్ చేసింది. 2020లో అదానీ గ్రూప్ కంపెనీలలో విదేశీ సంస్థల హోల్డింగ్‌లపై మార్కెట్స్ రెగ్యులేటర్ దర్యాప్తు ప్రారంభించిన తర్వాత అవి మూతపడటంతో అదానీ కంపెనీల్లో విదేశీ పెట్టుబడులకు మరింత బలం చేకూరినట్లయ్యింది. ఈ పరిణామం ఈ పెట్టుబడి సంస్థల అంతిమ లబ్ధిదారులను గుర్తించడంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కి సవాలుగా మారింది. మింట్ కథనం ప్రకారం.. మారిషస్ నుంచి అదానీ కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెట్టిన అసెంట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ జూన్ 2019 నుంచి అదృశ్యమయ్యింది. లింగో ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మార్చి 2015లో మూసివేయబడింది. మిడ్ ఈస్ట్ ఓషన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ గతేడాది ఆగస్టులో చిరునామా లేకుండా పోయింది. ఇఎం రిసర్జెంట్ ఫండ్ గతేడాది ఫిబ్రవరిలో మూసివేయబడింది. ఆసియా విజన్ ఫండ్ మూసివేసే ప్రక్రియలో ఉంది. అదానీ గ్రూపులో డొల్ల, దొంగ పెట్టుబడులపై ఇటీవల ఆర్గనైజ్డ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) ఓ రిపోర్ట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. అదానీ గ్రూప్‌లో రహస్యంగా పెట్టుబడి పెట్టిన ఇద్దరు వ్యక్తులు.. అదానీ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని వెల్లడించింది. గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ సంస్థల్లో పెట్టుబడులు కలిగి ఉన్నారని పేర్కొంది. సెబీ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిపింది. అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌పైనా సుప్రీంకోర్టు విచారిస్తున్న విషయం తెలిసిందే. కాగా.. సుప్రీం ఆదేశాల మేరకు అదానీ కంపెనీల్లో విదేశీ పెట్టుబడులపైనా సెబీ దర్యాప్తు జరుపుతోంది. విదేశీ పెట్టుబడులకు సంబంధించి మరింత సమాచారం దొరకాల్సి ఉందని సెబీ ఇటీవల అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించిన అఫిడవిట్‌లోనూ పేర్కొంది. కాగా.. అదానీ కంపెనీ షేర్లలో విదేశీ పెట్టుబడులపై విచారిస్తోన్న సెబీకి అదృశ్య ఇన్వెస్టర్లను కనుగొనడం పెద్ద సవాల్‌గా మారనుంది. ప్రధాని నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన గౌతం అదానీ ఆర్థిక అక్రమాలు, షేర్ల ధరల కృత్రిమ పెంపునపై అనేక రిపోర్టులుగా రాగా.. ఇప్పటికీ ఎక్కడా కూడా పారదర్శకంగా విచారణ జరగడం లేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే.

లోకేష్‌కు పోలీసుల నోటీసులు

57 మంది టిడిపి నేతలు, యువగళం వలంటీర్లపై కేసుల నమోదు

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు పోలీసులు బుధవారం నోటీసులు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో లోకేష్ యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం పాదయాత్ర ప్రారంభించేందుకు బస శిబిరం నుంచి లోకేష్ బయటకు రాగానే పోలీసులు అడ్డుకున్నారు. భీమవరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతోపాటు ముఖ్యమంత్రి జగన్, స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌పై రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారని, పాదయాత్ర కాన్వాయ్‌లో ఎక్కువ వాహనాలు ఉన్నాయని, రాత్రి సమయం దాటిపోయినా పాదయాత్ర జరిగిందనే అంశాలపై వివరణ ఇవ్వాలని లోకేష్‌కు, టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మికి పోలీసులు నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు వైసిపి మూకలు విఘాతం కలిగించలేదా? అని నిలదీశారు. నోటీసులు తీసుకునేందుకు నిరాకరించి పాదయాత్రను ప్రారంభించారు. లోకేష్ తరుపున ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు నోటీసులు తీసుకున్నారు. అనంతరం భీమవరం పెదగరువు మీదుగా సీతారామపురం వరకు పాదయాత్ర సాగింది. ఈ సదర్భంగా లోకేష్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేద క్షత్రియులకు చేయూతనందిస్తామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెడతామని, అమరావతిలో అల్లూరి మెమోరియల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర 2,800 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వెంప సెంటర్లో శిలాఫలకాన్ని లోకేష్ ఆవిష్కరించారు.

పోలీసులతో మాట్లాడుతున్న లోకేష్

57 మందిపై కేసుల నమోదు

భీమవరంలో వైసిపి, టిడిపి పరస్పర దాడులకు సంబంధించి టిడిపికి చెందిన 57 మందిపై భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి దాయం బెంజిమెన్, మల్లు మణికంఠ, మైలాబత్తుల మహేష్ ఫిర్యాదు మేరకు 57 మంది టిడిపి నేతలపై కేసు నమోదు చేశారు. 39 మంది యువగళం వలంటీర్లపై భీమవరం స్టేషన్‌లో, మరో ఐదుగురు వలంటీర్లపై నిడమర్రు స్టేషన్లో కేసు నమోదు చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, కోళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తోపాటు మరో పది మంది నేతలపైనా కేసులు నమోదయ్యాయి. వైసిపి ఫ్లెక్సీని చించివేశారని మరో కేసు నమోదు చేశారు. గాయపడిన కానిస్టేబుల్ రమేష్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేశారు. యువగళం కార్యకర్తలను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద మాజీ మంత్రులు దేవినేని ఉమ, కొల్లు రవీంద్ర పరామర్శించారు.

తిరుమల యాత్రికులకు చేతికర్రలు

- అలిపిరిలో పంపిణీ చేసిన టిటిడి చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల నడక దారిలో చిరుత పులల దాడి నేపథ్యంలో టిటిడి రక్షణ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా యాత్రికులకు చేతికర్రలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అలిపిరి పాదాల మండపం వద్ద ఇఒ ఎవి.ధర్మారెడ్డితో కలిసి టిటిడి చైర్మన్ బుధవారం యాత్రికులకు చేతికర్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. చేతిలో కర్ర ఉంటే ఏ జంతువైనా వెనకాడుతుందని శాస్త్రీయ పరిశీలన ద్వారా రుజువైందని చెప్పారు. పొలాలకు, అడవులకు వెళ్లేటప్పుడు గ్రామ ప్రజలు చేతికర్రలను ఆసరాగా తీసుకెళ్లడం వేల సంవత్సరాల నుంచి జరుగుతోందన్నారు. యాత్రికులకు చేతి కర్రను ఇచ్చి టిటిడి బాధ్యత తీరినట్టు భావించడం లేదని, యాత్రికులను గుంపులుగా పంపుతున్నామని, వీరికి సెక్యూరిటీ గార్డు భద్రతగా ఉంటారని, అక్కడక్కడ పోలీసు సిబ్బంది కూడా రక్షణగా ఉంటారని తెలియజేశారు. ఇప్పటి వరకు నాలుగు చిరుతలను బంధించామని చెప్పారు. ఎవి.ధర్మారెడ్డి మాట్లాడు తూ..రిజర్వ్ ఫారెస్ట్‌లో అలిపిరి నడక మార్గం ఉందని, ఇక్కడ ఇనుప కంచె వేయడానికి కేంద్ర అటవీ శాఖకు, వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు ప్రతిపాదనలు పంపామని, వారు తగిన డిజైన్లతో అంగీకారం తెలిపితే కంచె నిర్మిస్తామని తెలిపారు. చేతికర్రల కోసం అడవిని నాశనం చేయడం లేదని, పది వేల కర్రలు మాత్రమే తీసుకున్నామని, ఇందుకోసం రూ.45 వేలు ఖర్చు చేశామని తెలిపారు.

9న ఎయు స్నాతకోత్సవం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖ)

ఆంధ్ర విశ్వవిద్యాలయం 87, 88, 89, 90వ సంయుక్త స్నాతకోత్సవం ఈ నెల 9న నిర్వహించనున్నట్లు వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఎయు స్నాతకోత్సవ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. స్నాతకోత్సవానికి ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్య అతిథిగా జిఎంఆర్ సంస్థల అధినేత, ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ జిఎం.రావు హాజరుకానున్నారని తెలిపారు. పరిశ్రమలు - శాస్త్ర రంగంలో అవంతి ఫీడ్స్ సంస్థ ఎండి అల్లూరి ఇంద్రకుమార్ (డిఎస్‌సి), సాహిత్యం-కళా రంగాలలో ఎస్‌వి.యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి కొలకలూరి ఇనాక్ (డిలిట్)కు గౌరవ డాక్టరేట్లను అందించనున్నట్లు చెప్పారు. డాక్టరేట్లు 690 మంది, మెడల్స్ 600 మంది అందుకోనున్నారని తెలిపారు. కోవిడ్ కారణంగా స్నాతకోత్సవం రెండు పర్యాయాలు వాయిదా పడిందన్నారు.

కొలకలూరికి అరుదైన గౌరవం

అసాధారణ సాహితీమూర్తి డాక్టర్ కొలకలూరి ఇనాక్‌కు ఆంధ్ర విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఈయన 1959లో అదే యూనివర్సిటీ నుంచి బిఎ ఆనర్స్ పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచే అధ్యాపకులుగా ప్రస్థానం ప్రారంభించారు. తన 85వ ఏట అదే విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోనున్నారు. చదివిన యూనివర్సిటీ, చదువు చెప్పిన యూనివర్సిటీలో ప్రతిష్టాత్మక గౌరవం పొందడం అరుదైన గౌరవం.

రేపటి నుంచి ఐసెట్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐసెట్-2023 అడ్మిషన్ల కౌన్సిలింగ్ మొదటి దశ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేస్తామని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్, ఐసెట్ కన్వీనర్ కె రామ్మోహన రావు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వెబ్ కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్ ఈ నెల 8 నుంచి 14 వరకు ఉంటుందని వెల్లడించారు. సర్టిఫికేట్ల వెరిఫికేషన్ 9 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తామని వివరించారు. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ 19 నుంచి 21 వరకు ఉంటుందని, 22వ తేదీ ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉందని తెలిపారు. వికలాంగ, స్పోర్ట్స్, ఎన్‌సిసి, ఆంగ్లో ఇండియన్స్ వారికి విజయవాడలోని ఆంధ్రా లయోల కళాశాలలో ఈ నెల 12న సర్టిఫికేట్ల వెరిఫకేషన్ ఉంటుందని పేర్కొన్నారు. సీట్ల కేటాయింపు ఈ నెల 25న ఉంటుందని అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఇదే నెల 26 లోపు రిపోర్టు చేయాలని వివరించారు. ఈ నెల 27 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణ 20కి వాయిదా

ప్రజాశక్తి-విశాఖ లీగల్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో హత్యాయత్నం కేసు విచారణ వాయిదా పడింది. ఈ కేసు విచారణను ఎసిబి కేసుల విచారణ ప్రత్యేక కోర్టు ఈ నెల 20కి వాయిదా వేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన కోడి కత్తితో హత్యాయత్నం కేసును విశాఖ మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఎసిబి కేసుల విచారణ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి బుధవారం విచారణ చేపట్టారు. ఈ కేసు విజయవాడ ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు నుంచి బదిలీపై వచ్చిన తరుణంలో కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను విశాఖపట్నం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టు అధికారికంగా తీసుకోవాల్సిన ఉన్నందున వాయిదా వేశారు. జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకు సంబంధించిన పిటిషన్ కూడా విచారణను ఈ నెల 20కి వాయిదా వేసి ఆ రోజు వినేందుకు న్యాయమూర్తి సంసిద్ధత తెలియజేశారు. నిందితుడు శ్రీనును పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు.

శ్రీవారికి 108 బంగారు పుష్పాల విరాళం

తిరుమల : తిరుమల శ్రీవారికి బుధవారం భారీ విరాళం అందింది. అష్టదళపాదపద్మారాధన సేవకు ఉపయోగించే 108 బంగారు పుష్పాలను లలితా జ్యువెలర్స్ అధినేత కిరణ్ కుమార్ విరాళంగా ఇచ్చారు. రంగనాయకుల మండపంలో టిటిడి ఇఒ ఏవి.ధర్మారెడ్డికి కోటి యాభై లక్షల విలువ చేసే 108 బంగారు పుష్పాలను అందజేశారు. కిరణ్ కుమార్‌ను పట్టు వస్త్రాలతో టిటిడి ఇఒ సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT BENGALURU
M.V.C. No.3682/2023
BETWEEN: Sri. Chalapathi .V ... PETITIONER
And: Mrs. Rafiah Parveen .M & anr ... RESPONDENTS
NOTICE TO RESPONDENT No.1

Mrs. Rafiah Parveen .M, W/o Abdul Hafiz .S K, Major by age, R/at: No.23-1-35/1, Near Krishna Theater, Atchampet road, Sattenapalli Town, Guntur District, Andhra Pradesh-522403.

Whereas, the petitioner in the above case has filed the above claim petition against you, claiming compensation of Rs.30,00,000/- (Rs. Thirty Lakhs Only) for the injuries sustained by the petitioner in a R.T.A, caused by your Maruthi Ertiga car bearing Reg.No.AP-07-CT-9069 on 16-05-2022, at about 5:30 P.M Chennai NH-75 Road, near Padmaghatta gate, Mulabagal Taluk, Kolar District. Hence, you are hereby summoned to appear before this court in person or by a pleader duly Instructed, and able to answer all the material questions relating to the case on **18-10-2023** at 11:00 A.M., failing which the above cases will be disposed of ex-parte.

Given under my and the seal of this court on 02-08-2023

By order of the court, Assistant Registrar, court of Small causes, Bangalore.

Advocate for Petitioner:
N. Manjunath, Advocate,
No.3, Amar Towers, 1st Cross,
Gandhinagar, Bengaluru-560009.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

ఏదైతే, **అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులను జారీచేసి, దిగువ రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా సదరు నోటీసుల్లో పేర్కొన్నట్లు వర్తించు రేట్లతో దానిపై వడ్డీతోపాటు వారి సదరు పేరుకు ఎదురుగా పేర్కొనబడిన మొత్తాలను, చెల్లించు/రియలైజేషన్ తేది వరకు సంభవించు వర్తించు తదుపరి వడ్డీ, ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥వాటితోసహా పై పేర్కొన్న మొత్తాలను దిగువ రుణగ్రహీతలును చెల్లించవలసిందిగా కోరబడినది.

క్ర. సం	రుణ ఖాతా నం./ రుణగ్రహీత పేర్లు/విక్రేత బ్యాంకు పేరు/	డిమాండ్ నోటీసు తేది/ 13(2) నోటీసు మొత్తం రూ.లో	స్వాధీనతా తేది & విధానం
1.	027765900000477/ మెసెర్స్. వీర వెంకట కాటన్ ట్రేడర్స్, ప్రొప్రైటర్ శ్రీ.రవి సింగయ్య, శ్రీ.రవి సింగయ్య, శ్రీ.ఎస్. రవి, శ్రీమతి. ఆర్. విజయ మరియు శ్రీ వి.సుబ్బారావు	19 సెప్టెంబర్, 2017 మరియు రూ.2,06,57,679.4/- 01 సెప్టెంబర్, 2017	లాంఛనప్రాయం 04/09/2023

సెక్యూర్డ్ అసెట్ వివరణ
గుంటూరు, తాడికొండ, తాడికొండ రెవెన్యూ మండలం, లామ్ గ్రామం, లామ్ గ్రామ పంచాయతీ ఏరియా పరిధిలో ఉన్న డో.నం.305 వద్ద మొత్తం ఆ ఖాళీ సైట్ విస్తీర్ణం 620 చ.గ.లు. (బయటకు 1820 చ.గ.లు.) హద్దులు : తూర్పు: సర్కార్ డొంక, పడమర : శ్రీ.లాలాది అక్కయ్య సైట్, దక్షిణం: శ్రీ. కోట ధర్మారావు సైట్, ఉత్తరం: శ్రీ.ఆలపర్తి శివ ప్రసాద్ సైట్.

పైన పేర్కొన్న రుణగ్రహీతలు బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ప్రత్యేకించి పైన పేర్కొన్న రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా, పైన వివరించిన తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ పేర్కొన్న చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు పై వివరించిన ఆస్తులు/సెక్యూర్డ్ అసెట్స్‌ను **ఆర్సిల్** యొక్క అధీకృత అధికారి **లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.** ప్రత్యేకించి ఇందు పై పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, పైన పేర్కొన్న ఆస్తులు/సెక్యూర్డ్ అసెట్స్‌తో లావాదేవీలు జరుపరాదని మరియు **ఆర్సిల్**‌కు చెల్లించాల్సిన బకాయి మొత్తాన్ని చెల్లించి జరుపుకోవచ్చు. రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటలో, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించారు.

ప్రదేశం: గుంటూరు
తేది: 07.09.2023

సం/- అధీకృత అధికారి
అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్

అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్
Arcil Premier ARC
CIN-U65999MH2002PLC134884, www.arcil.co.in
నమోదిత కార్యాలయం: ది రూబీ, 10వ అంతస్తు, 29, సేనాపతి బాపట్ మార్గ్, దాదర్ (వెస్ట్), ముంబాయి-400028 టెలి: + 91 2266581300
శాఖ చిరునామా: ఫ్లాట్ నం.207, 2వ అంతస్తు, భువన టవర్స్, ఎస్.డి.రోడ్, సికింద్రాబాద్-500 003

MSME TECHNOLOGY CENTRE
A Government of India Society, Ministry of Micro, Small and Medium Enterprises
Plot No.6, IC-Pudi, Near APSEZ, Atchuthapuram, Visakhapatnam, Andhra Pradesh -531011
www.msmetcvizag.com Email: info@msmetcvizag.org, Ph: 95153 97553, 08924-282600/601
MSME-TC(V)/Admin/Cont.Emp Recr./2023-24/02 Dt: 30.08.2023

WALK-IN-INTERVIEWS

The MSME Technology Centre (Visakhapatnam) is conducting **Walk-In-Interviews on 11th Sep-2023** for engagement in **Various Positions** purely on a Contractual basis on consolidated pay. The Contract is initially for a period of **11 Months** and will be further extendable based on Institute's requirement and incumbent's performance.

Sl. No.	Name of the Post	Essential Qualification	Maximum Age	No.of Positions	Essential Experience
1.	Tool & Die Designer/ Maker	B.E/B.Tech (Mech) **Desirable:** PDTD/PGTD/ NSQF Level 6 Courses of Mechanical	50 Years	01	Min.Exp 05 years
2.	Faculty-CNC Programming & Machining	B.E/B.Tech (Mech) **Desirable:** MCCCT/ NSQF Level 6 Courses of Mechanical	40 Years	01	Min.Exp 05 years
3.	Faculty-Mechanical Engineering **(For Diploma Courses)**	B.E/B.Tech (Mechanical)	30 Years	02	Min.Exp 02 years
4.	Faculty-Electrical/ Electronics/ Mechatronics Engg. **(For Diploma Courses)**	B.E/B.Tech (EEE/ECE/Mechatronics)	30 Years	01	Min.Exp 02 years
5.	Faculty-Electrical/ Electronics/ Mechatronics Engg **(For NSQF Courses)**	B.E/B.Tech/M.E/M.Tech (EEE/ECE/ Mechatronics) **Desirable: NSQF Level 6 Course of Mechatronics**	40 Years	01	Min.Exp 03-05 years
6.	Faculty-CAD/CAE	B.E/B.Tech (Mech) **Desirable: MCCCT/ NSQF Level 6 Courses of Mechanical**	35 Years	01	Min.03 Exp. In Academics / Industry
7.	DET (Diploma Engg. Trainee)	Diploma (Mech)	21 Years	01	Nil
8.	Exam Cell Assistant	Any Degree	30 Years	01	Min.Exp 01-03 years
9.	Lab Assistant for Workshop	Diploma (Mechanical) / ITI (Fitter/Turner/Machinist)	30 Years	01	Min.Exp 01-03 years
10.	Admin & Accounts in charge	B.Com with MBA (Finance) / M.Com / CA (Inter) / CMA	50 Years	01	Min. Exp 10 Years (**Preferable :** Working in State & Central Govt./ PSU's / State & Central Govt. Authonomous Body's in Admin & Accounts Dept. **Note :** Retd. Employees of Central/ State / PSU's / Autonomous Body may also apply.
			Total	11	

(1) Detailed Notification will be available in the Website: **www.msmetcvizag.org. (2)** Interested candidates may **walk in from 10:00 AM onwards** on date with all **original certificates and one set photo copies of Education & Experience, One Recent Colour Pass Port Size Photograph** along with a resume. **(Without Originals candidature of the candidate cannot be considered). (3)** Registration will be closed at **12:00 P.M** strictly. **(4)** # Age relaxation may be considered for the highly experienced and deserved candidates.

Venue for Walk-In-Interview: Plot No.6, IC-Pudi, Near APSEZ, Atchutapuram, Visakhapatnam, Andhra Pradesh -531011, Email: admin@msmetcvizag.org & info@msmetcvizag.org, Ph.: 08924- 282600/604/150. Mobile: 7995531372.

Sd/-
Deputy General Manager

పబ్లిక్ నోటీసు

ICICI Bank
నమోదిత కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, ల్యాండ్ మార్క్, రేస్ కోర్స్ సర్కిల్ వడోదర-390007
కార్పోరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈ), ముంబై-400051

శాఖా కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ గ్రీన్ స్క్వేర్ ప్లాజా, పబ్లిక్ గార్డెన్ ఎదురు, హనంకొండ, తెలంగాణ-506001

దిగువ రుణగ్రహీత/లు బ్యాంక్ నుండి వారి ద్వారా రుణాల సౌకర్యాలు అసలు మరియు వడ్డీ తిరిగిచెల్లించుటలో విఫలమైనారు మరియు రుణాలు నాన్-ఫర్‌ఫార్మింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడినాయి. వారి చివరిగా తెలిసిన చిరునామాల మీద సెక్షన్ 13 (2) యొక్క సెక్యురిటీజైషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యురిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 క్రింద నోటీసు జారీచేయబడింది, అయినప్పటికీ ఇది తీసుకొనబడలేదు మరియు కావునా పబ్లిక్ నోటీసు ద్వారా వారు ఇక్కడ గమనించవలసిందిగా కోరుతున్నాము.

క్ర. సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారుడు పేరు/(లోను ఖాతా నంబర్) మరియు చిరునామా	అమలుచేయబడిన సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	పంపబడిన నోటీసు తేది/నోటీసు తేది నాటికి బకాయి	ఎన్‌పిఎ తేది
1.	LATEN00042124280/ దురు భాగ్యరాజు/10 12 28 చెంచుపేట/ తెనాలి మార్రీస్‌పేట/ తెనాలి మార్రీస్‌పేట/గుంటూరు-522202	ZXI+/ ZXI+/ Ertiga/ AP39GA5634	02-Aug-2023 Rs. 7,52,868/-	06-Jul-2021
2.	LANAR00041265948/ జాకిర్ హుస్సేన్ షేక్/డో.నం.18 553 లెనిన్ నగర్/పిడుగురాళ్ల గుంటూరు/నరసరావుపేట/నరసరావుపేట-522413	Xcent/ S 1.1 CRDi/ Xcent/ AP39DQ5808	03-Jul-2023 Rs. 6,14,431/-	11-Jul-2022
3.	LAJAP00043495293/ జుజ్జూరి పద్మాకుమారి/3-80,/మెయిన్ రోడ్డు, గౌరవం/మెయిన్ రోడ్డు, గౌరవం/కృష్ణ-521178	Product/ ZETA MT PETROL/ XL6/ AP39JQ4999	02-Aug-2023 Rs. 7,82,506/-	08-Sep-2022
4.	LUNNM00045691744/ కటరపు రాజారావు/కటరపు వెంకట్రావమ్మ/ 3 87, గొల్లమూడి కృష్ణ/ రామాలయం వద్ద/నందిగామ-521185	VDi/ VDi/ SWIFT DZIRE/ AP16DK4645	03-Jul-2023 Rs. 5,15,670/-	9-Dec-2022
5.	LAKAC00043706563/ కోగంటి సాయి దీప్/6-108/2/కంచికచెర్ల మండలం/నక్కలంపేట/విజయవాడ-521180	HECTOR/ Diesel 2.0 - MT- Sharp/ HECTOR/ AP39JY1350	02-Aug-2023 Rs 15,41,864/-	11-Jul-2022
6.	LAJAP00043997191/ మర్తి రామకృష్ణ/మర్తి వెంకటేశ్వర్లు/2 15,/ కృష్ణ మందిర్/బండిపాలెం/కృష్ణ-521178	VITARA BREZZA/ VXI/ Vitara Brezza/ AP39KJ3600	02-Aug-2023 Rs. 5,46,789/-	08-Nov-2022
7.	LUNUZ00043059625/మిరియాల దినేష్/మిరియాల జయవాణి/8 81 గాజుల మాలపల్లి/చర్చి వద్ద నడిమి తిరువూరు/విజయవాడ/విజయవాడ-521235	Swift Dzire/ VDi/ SWIFT DZIRE/ AP16DG2224	03-Jul-2023 Rs. 3,67,225/-	09-Nov-2021
8.	LANAR00041533161/నరసింహారావు అచ్యుత/డో.నం.15 16 వినుకొండ/గుంటూరు/గుంటూరు/నరసరావుపేట-522647	Product/ S/ VENUE/ AP39EB7111	02-Aug-2023 Rs. 4,36,225/-	14-Sep-2021
9.	LANAR00043609378/ పరెం లింగయ్య/పరెం నాగేశ్వరరావు/1 267 పెరూరుపాడు బొల్లపల్లె/గుంటూరు/గుంటూరు/గుంటూరు-522657	1.5 SX(O)/ 1.5 SX(O)/ Creta/ AP39JR0909	02-Aug-2023 Rs. 13,91,302/-	04-Jul-2022
10.	LANAR00044402299/ రావూరి త్రినాథ్ భూషణాచారి/3 2 6 166,/ త్రీ వెల్ సెంటర్/పాతూరు/గుంటూరు-522601	NEW I20/ MAGNA EXEC CRDI/ NEW I20/ AP39KX8811	02-Aug-2023 Rs. 6,03,111/-	06-Aug-2022
11.	LAMAC00041093932/సాయినాథ్ కపవరపు/డో.నం.14 2 809 98 రోప్ లైన్ కాలనీ వార్డు 7/మాచర్ల గుంటూరు/మాచర్ల గుంటూరు/గుంటూరు-522426	DZIRE/ VDI/ DZIRE/ AP39DC9234	02-Aug-2023 Rs. 9,43,647.53/-	11-Jan-2021
12.	LACKT00043159499 /షేక్ నూర్/5 25 మెయిన్ బజార్ నాదెండ్ల మండలం/ అప్పాపురం ఇర్లపాడు గుంటూరు/అప్పాపురం ఇర్లపాడు గుంటూరు/గుంటూరు-522611	VITARA BREZZA/ ZXI/ Vitara Brezza/ AP39HY2786	02-Aug-2023 Rs. 7,18,493/-	08-Feb-2023
13.	SPNAR00040685850/ తాళ్లూరి అబ్రహాం/1-104 తండ్రి. కోటయ్య/ మరికపుడి/గుంటూరు పిన్-522549	SWIFT/ SWIFT VDI BSIV/ AP07CT3777	02-Aug-2023 Rs. 5,62,325/-	31-Aug-2021
14.	LANAR00041310540/ వీరాంజినేయులు వుసర్తి/డో.నం.8 115 2 రుపెనిగుంట్ల/నకరికల్లు రావిపాడు/నకరికల్లు రావిపాడు/గుంటూరు-522603	GRAND I10/ MAGNA 1.2/ GRAND I10/ AP39DS0617	02-Aug-2023 Rs. 4,61,157/-	11-Oct-2022
15.	LVKAC00038431437/ చల్లా శ్రీనివాసరావు/చల్లా వెంకటేశ్వరరావు/ 8 66 చెరువ కట్ట బజారు/చెరువకట్ట బజారు/కంచికచెర్ల/కంచికచెర్ల-522180	AL 3718 / AL 3718 CHASSIS/AL 3718 / AP16TQ2238	02-Aug-2023 Rs. 16,47,130/-	01-Dec-2021
16.	LVNNM00039419383/ దండమూడి ఎడ్యుకేషనల్ అకాడమీ/నందిగామ/ కృష్ణ/ఆంధ్రప్రదేశ్/నందిగామ-521185	EICHER 10.75/ STARLINE SCHOOL/ EICHER 10.75/ AP39Y4267	02-Aug-2023 Rs. 8,25,684/-	05-Jan-2023
17.	LQVJM00038605664/ ముల్లంగి ఎలిసమ్మ/ముల్లంగి యోహాన్/2-62 మల్లినోయిన పల్లె/కృష్ణ/ఆంధ్రప్రదేశ్/విజయవాడ-521228	JCB 3DX/ BACKHOE LOADER/ BACKHOE LOADER/ AP39J3681	03-Jul-2023 Rs. 11,19,812/-	31-Jan-2021
18.	LQGTR00038357841 /నాగమణి దర్శి/దర్శి భాస్కరరావు/15-88ఎ అత్తలూరివారి/పాలెం గుంటూరు ఆంధ్రప్రదేశ్/గుంటూరు/గుంటూరు-522305	JCB 3DX/ BACKHOE LOADER/ JCB 3DX/ AP07ED1115	03-Jul-2023 Rs. 13,27,857/-	20-Aug-2022

పై రుణగ్రహీత/లు మరియు వారి హామీదారులు (వర్తించబడతారు) నోటీసు యు/ఎస్. 13(2), ప్రకారం ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 60 రోజులలోపట బకాయిలు చెల్లించవలసిందిగా కోరుతున్నాము లేనియెడల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 నోటీసు యు/ఎస్. 13(2) నిబంధనల ప్రకారం తదుపరిగా మందడగు వేయడం జరుగుతుంది.

తేది: 07 సెప్టెంబర్, 2023
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్., తరపున

HDFC BANK హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్.,
బ్రాంచ్ : 1వ అంతస్తు, శ్రీ హరి టవర్స్, 59ఎ-1-5/1, విజయవాడ-520008, ఫోన్ నెం.0866-2429130,
CIN L65920MH1994PLC080618 Website: www.hdfcbank.com

స్వాధీనత ప్రకటన

హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్ **(17 మార్చి 2023 ఆర్డర్ ప్రకారం గౌరవనీయమైన ఎన్‌సిఎల్‌టి-ముంబై ద్వారా ఆమోదించబడిన విలీన పథకం ద్వారా గతంలో హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్‌ను హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనం చేయబడింది) (హెచ్‌డిఎఫ్‌సి)** వారి యొక్క అధీకృత అధికారిగా ఉన్న ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 నందు చెప్పబడిన సెక్షన్ 13(12) ప్రకారము సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 3 తో చదవబడే సదరు చట్టం నందలి సెక్షన్ 13(2) క్రింద తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ ఈ దిగువ వివరముగా చెప్పబడిన ఋణగ్రహీత(లు) / చట్టబద్ధ వారసు(లు) / చట్టపూర్వకముగా ప్రాతినిధ్యము వహించువారు(లు)ను ఈ సంబంధిత నోటీసు/లు నందు చెప్పబడిన విధముగా బకాయి మొత్తములను మరియు దానిపై తదుపరి వడ్డీ, సంబంధిత ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొదలగు వాటితో కలిపి ఈ నోటీసు అందిన తేది నుండి 60 దినములలోగా చెల్లించవలసినదిగా కోరుతూ డిమాండ్ నోటీసు/లు జారీ చేయడమైనది.

వ. నెం.	ఋణగ్రహీత(లు) / చట్టబద్ధ వారసు(లు) / చట్టపూర్వకముగా ప్రాతినిధ్యము వహించువారు(లు)	మొత్తం బకాయిలు	డిమాండ్ నోటీసు తేది.	స్వాధీనత నోటీసు తేది.	సెక్యూర్డ్ అస్సెట్(లు) / స్థిరాస్తి వివరములు
1)	శ్రీ హీరాపూర్ ఇస్తాన్ భాషా (ఋణగ్రహీత) శ్రీమతి హీరాపూర్ షభానా (సహ-ఋణగ్రహీత) మరియు మెస్సర్స్ మెట్రో ఏజెన్సీస్ (సహ-ఋణగ్రహీత)	తేది.31-01-2023* నాటికి రూ.36,57,619/-	02-05-2023	05-09-2023 (లాంఛనాత్మక స్వాధీనత)	కృష్ణా జిల్లా, విజయవాడ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, రాజేశ్వరిపేట, పాత మున్సిపల్ వార్డు నెం.13, కొత్త మున్సిపల్ వార్డు నెం.14 వద్ద గల పాత సర్వే నెం.89/1, కొత్త సర్వే నెం.89/1ఎ1ఎ1 లో 150 చ॥గ॥లు లేదా 125.415 చ॥మీ॥లు విస్తీర్ణంతో డోర్ నెం.19-13-14 దగ్గర ప్లాట్ నెం.8, 9 లోని భూమి అందు గల ఇల్లునకు **హద్దులు : తూర్పు** : ఉస్మాన్‌బీ మరియు సత్యనారాయణ యొక్క ప్లాట్ నెం.12, 13, **దక్షిణం** : జమలయ్య యొక్క ప్లాట్ నెం.7, **పడమర** : రోడ్డు, **ఉత్తరం** : షేక్ మహబూబ్ యొక్క ప్లాట్ నెం.10.
2)	శ్రీమతి కనకదుర్గ, భర్త. లేటు ఉమ మహేశ్వర రావు జూలూరి (మరణించినారు), శ్రీ తేజశ్వి, తండ్రి. లేటు ఉమ మహేశ్వర రావు జూలూరి (మరణించినారు), మిస్ బిందు మాధవి, తండ్రి. లేటు ఉమామహేశ్వర రావు జూలూరి (మరణించినారు), మిస్ మానస, తండ్రి. లేటు ఉమ మహేశ్వర రావు జూలూరి (మరణించినారు) మరియు ఇతర తెలిసిన, తెలియని లేటు ఉమామహేశ్వర రావు జూలూరి (మరణించినారు) వారి యొక్క చట్టరీత్యా వారసు(లు), చట్టరీత్యా ప్రాతినిధ్యం వహిస్తున్నవారు, కేటాయించినవారు మరియు వారసులు (ఇప్పటి నుండి ఋణగ్రహీతగా వ్యవహరిస్తారు)	తేది.31-01-2023* నాటికి రూ.26,09,870/-	13-03-2023	05-09-2023 (లాంఛనాత్మక స్వాధీనత)	కృష్ణా జిల్లా, విజయవాడ, పటమట, కానూరు గ్రామం, మురళీ నగర్ వద్ద ఆర్.ఎస్.నెం.22/2 లోని 158.88 చ॥గ॥లు లేదా 132.843 చ॥మీ॥లు విస్తీర్ణం గల భూమి నందు 800 చ॥అ॥లు విస్తీర్ణంతో గల డోర్ నెం.4-61/1 (ఉత్తరం భాగం) లోని ఆర్.సి.సి. రూఫ్డ్ భవనమునకు **హద్దులు : తూర్పు** : బజార్, **దక్షిణం** : శ్రీ జూలూరి కృష్ణారావు గారికి చెందిన ఆస్తి, **పడమర** : శ్రీ మారుతీ రామ్ మోహన్ రావు గారికి చెందిన ఆస్తి, **ఉత్తరం** : బి వి ఎస్ ప్రసాద్ గారికి చెందిన ఆస్తి.
3)	శ్రీ బొడ్డు అవినాష్ (ఋణగ్రహీత)	తేది.31-01-2023* నాటికి రూ.32,92,610/-	02-05-2023	05-09-2023 (లాంఛనాత్మక స్వాధీనత)	**షెడ్యూల్ ఎ ఆస్థి :** బహుళ అంతస్తుల నివాస అపార్ట్‌మెంట్ కొరకు డెవలప్ చేయబడిన ఫేజ్-2 మొత్తం భూమి ఎకరా 5.66 సెంట్లు నందు గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం పరిధి, నంబూరు గ్రామ పంచాయితీ, నంబూరు గ్రామం నందు సర్వే నెం.207, 214/1 మరియు 216 లో ఏర్పాటు చేయబడిన ఎకరా 3.36 సెంట్లు భూమి మరియు గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, కంతేరు గ్రామం, గుంటూరు, తాడికొండ సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ పరిధి నందు ఆర్.ఎస్.నెం.142/1బి, 144/1బి లో ఏర్పాటు చేయబడిన అదే ఫేజ్-2 భూమి నందు ఎకరా 2.29 సెంట్లు యావదాస్తినకు **సరిహద్దులు : ఉత్తరం** : 18.3 మీటర్ల వెడల్పు రహదారి, **దక్షిణం** : 18.3 మీటర్ల వెడల్పు రహదారి, **తూర్పు** : కృత్రిమ చెరువు, **పడమర** : 12.2 మీటర్ల వెడల్పు రహదారి. **షెడ్యూల్-బి ఆస్తి :** గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, కంతేరు గ్రామం, గుంటూరు, తాడికొండ సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ పరిధి నందు ఆర్.ఎస్.నెం.124/1బి, 144/1బి లో ఏర్పాటు చేయబడిన అదే ఫేజ్-2 ప్రత్యేకంగా ఈ అపార్ట్‌మెంట్ యూనిట్ భూమి ఎకరా 2.29 సెంట్లు విస్తీర్ణం నందు 39.40 చ॥గ॥ల అవిభాజ్యపు వాటా భూమితో సహా విల్లా బ్లాక్ నెం.0940 నందు విక్రయించదగిన / మొత్తము బిల్టప్ ఏరియా 1279 చ॥అ॥లు మరియు 9వ అంతస్తు నందు 2బిహెచ్‌కె టైప్‌తో 893.19 చ॥అ॥ల కార్పెట్ ఏరియాతో పడమర ఫేస్ గల విల్లా నెం.0940 నకు **సరిహద్దులు : ఉత్తరం** : ఓపెన్ టు స్కై ఆ తర్వాత యూనిట్ నెం.0941, **దక్షిణం** : ఓపెన్ టు స్కై ఆ తర్వాత యూనిట్ నెం.0939, **తూర్పు** : ఓపెన్ టు స్కై, **పడమర** : కారిడార్.

* తదుపరి వడ్డీలు మరియు వర్తించు అన్ని సంబంధిత ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొదలగునవి కూడా బకాయిలు పూర్తిగా / వసూలు అగునంత వరకు / చెల్లింపు అగు తేదీ వరకు జరుపుబడు ఖర్చులతో కలిపి చెల్లించవలెను.

సదరు బకాయి మొత్తాన్ని ఋణగ్రహీత(లు) / చట్టబద్ధవారసు(లు) / చట్టపూర్వకముగా ప్రాతినిధ్యము వహించువారు(లు) చెల్లించుటలో విఫలమైనందున పైన వివరించిన స్థిరాస్తి / సెక్యూర్డ్ అస్సెట్స్‌ను సదరు రూల్స్ యొక్క రూల్ 8 తో చదువుకొనే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని పైన తెలిపిన తేదీన **హెచ్‌డిఎఫ్‌సి** వారి యొక్క అధీకృత అధికారిగా ఉన్న ఈ దిగువ సంతకందారుడు **స్వాధీనం** చేసుకొన్నారని ఋణగ్రహీత(లు) / చట్టబద్ధవారసు(లు) / చట్టపూర్వకముగా ప్రాతినిధ్యము వహించువారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

సదరు స్థిరాస్తులు / సెక్యూర్డ్ అస్సెట్స్‌లతో ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు ఒక వేళ ఎవ్వరైనా సదరు స్థిరాస్తులతో / సెక్యూర్డ్ అస్సెట్స్‌లతో ఏ లావాదేవి అయినా జరిపినచో **హెచ్‌డిఎఫ్‌సి** వారి తనఖాకి లోబడి ఉండునని ముఖ్యంగా ఋణగ్రహీత(లు) / చట్టబద్ధవారసు(లు) / చట్టపూర్వకముగా ప్రాతినిధ్యము వహించువారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

ఋణగ్రహీత(లు) / చట్టబద్ధవారసు(లు) / చట్టపూర్వకముగా ప్రాతినిధ్యము వహించువారు(లు) సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 లోని సబ్-సెక్షన్ (8) యొక్క నిబంధనలు గమనించగలరు.

ప్రదేశము : విజయవాడ, తేది : 05.09.2023
సం/- అధీకృత అధికారి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తరపున

రిజిస్టర్డ్ ఆఫీస్ : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబాయి - 400013

సంపాదకీయం

'సనాతన' వివాదం

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు, ఆ రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలను వివాదాస్పదంగా మార్చడం ద్వారా లబ్ధి పొందడానికి బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు తాపత్రయపడుతున్న తీరు హాస్యాస్పదం. తొమ్మిదేళ్లు కేంద్రంలో అధికారం చలాయించిన తరువాత కూడా చేసిన అభివృద్ధి, ప్రజలకు జరిగిన మంచి గురించి చెప్పుకోవడానికి ఏమీ లేక ఎన్నికల వేళ అడ్డమైన గడ్డి కరవడానికి బిజెపి నేతలు సిద్ధపడుతున్న తీరు విస్మయం కలిగిస్తోంది. తమిళనాడులోని అభ్యుదయ రచయితల సంఘం కొంతకాలంగా సనాతన ధర్మంలోని అనాచారాలకు, అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తోంది. ఆ ప్రచారంలో భాగంగానే సనాతన ధర్మ నిర్మూలన మహానాడు పేరిట ఒక సదస్సును ఆ సంఘం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఉదయనిధి అంటరానితనం, అసమానతలు, లింగవివక్షతను ప్రస్తావిస్తూ వాటికి నిలయమైన సనాతన ధర్మం కరోనా, డెంగ్యూ వైరస్ లాంటిదని, దానిని నిర్మూలించాల్సిందేనని అన్నారు. దీనిలో కొంత భాగాన్ని తొలగించి, మిగిలిన దానికి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా ప్రజలను రెచ్చగొట్టే కుట్రకు బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు తెరతీశాయి. తన వ్యాఖ్యలను వివాదాస్పదం చేయడం ద్వారా పబ్బం గడుపుకోవడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలు చూసిన ఉదయనిధి తాను అన్న మాటలకు కట్టుబడి ఉంటానని, న్యాయప్రక్రియను సైతం ఎదుర్కొంటానని చెప్పారు. కుల, మతాల ప్రాతిపదికన ప్రజలను విభజించేదే సనాతన వాదమని, అటువంటి వివక్ష ఏ మతంలో ఉన్నా నిర్మూలించాల్సిందేనని స్పష్టం చేశారు.

నిరక్షరాస్యతను నిర్మూలించడమంటే చదువురాని వారినందరినీ నిర్మూలించాలని కాదు కదా! అదేమాదిరి సనాతన ధర్మాన్ని నిర్మూలించడమంటే దానిలోని అరాచకాన్ని, అసమానతలను తొలగించాలనే అర్థం. దీనిని దాచిపెట్టి నానా రచ్చ చేస్తున్న బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు సనాతన ధర్మంలో ఏముందో మాత్రం చెప్పడం లేదు. నిఘంటువుల ప్రకారం సనాతనమంటే మార్పు లేనిది, స్థిరమైనదని పండితులు చెబుతున్నారు. మార్పు లేనిది, మారనిది ఏముంటుంది? ఈ రోజుల్లో ఎవరైనా ముక్కుపచ్చలారని పసిబిడ్డను కాటికి కాలు చాపిన ముదుసలితో పెళ్లి చేయడానికి సిద్ధపడితే సనాతనుడని కీర్తిస్తామా? దురదృష్టవశాత్తు భర్త చనిపోతే, ఆ మృతదేహంతో పాటు తమ ముద్దుల కూతురుని తగలబెట్టి మురిసిపోయే తల్లితండ్రులు ఇప్పుడెక్కడైనా ఉన్నారా? కన్యాశుల్కం బారిన పడి బలవన్మరణాలకు పాల్పడిన పుత్తడిబొమ్మల కథలు మరిచామా? వరకట్నపు జ్వాలల్లో ఆహుతవుతున్న నిండు జీవితాలు ఇప్పటికీ ఎన్నో! డెంగ్యూ, కరోనాల కారణంగా ఎందరు చనిపోయారో మన కళ్ల ముందు లెక్కలున్నాయి. ఏది ప్రమాదమో తేలాలంటే సనాతన ధర్మం పేరిట చిందిన విషం ఎందరి ప్రాణాలను బలిగొందో, ఎందరి బతుకులను మొగ్గలోనే తుంచి మోడుగా మార్చిందో, మాతమ్మలు, జోగినీలు, దేవదాసీల పేరిట జీవచ్ఛవాలను చేసిందో లెక్కల గుట్టు విప్పి సమాజం ముందు పెట్టాలి. ఆ ధైర్యం చేయగలరా?

పోరాటాలు, సంఘ సంస్కరణ ఉద్యమాలు సనాతన ధర్మంలో ఎన్నో మార్పులను తీసుకువచ్చాయి. కొన్ని దురాచారాలను పూర్తిగా నిర్మూలించాం. కానీ, ఇప్పటికీ వేయిపడగలతో కుల వివక్ష కాలకూటాన్ని వెదజల్లుతూనే ఉంది. శంభూకుడు, ఏకలవ్యుడిల వారసత్వాన్ని కొనసాగించడానికి ఒక పథకం ప్రకారం కుట్ర సాగుతోంది. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికీ చట్టంగా మారలేదంటే సనాతన ధర్మం నరనరాన నింపిన పురుషాహంకార భావజాలమే కారణం! అధికారంలో కొనసాగితేనే ఈ వివక్షను, అసమాతనలను బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు పెంచి పోషించగలుగుతాయి. దానికోసం ఏమైనా చేయడానికి, ఎంతకైనా తెగించడానికి వారు సిద్ధం. సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వాలంటూ ప్రధాని స్వయంగా తన మంత్రివర్గ సహచరులను తాజాగా ఆదేశించడమే దీనికి నిదర్శనం. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నిరుద్యోగం, అధిక ధరలు, సామాజిక న్యాయం వంటి ప్రజల దైనందిన సమస్యలను పక్కనబెట్టి ఉద్రేకాలను రెచ్చగొట్టే ఈ తరహా ఎత్తుగడలను మరింతగా ఆ శక్తులు ముందుకు తీసుకువచ్చే ప్రమాదం ఉంది. దీనిని తిప్పికొట్టేందుకు లౌకిక, ప్రగతిశీల, ప్రజాతంత్ర శక్తులు మరింత ఐక్యంగా ముందుకు రావాలి. ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పరచాలి. రానున్న ఎన్నికల్లో బిజెపిని, దానికి వంత పాడే శక్తులను ఓడించడం ద్వారానే సమాజాన్ని ముందుకు తీసుకుపోగలం.

మహనీయుల మాట

విద్య ఒక ఆయుధం. దాని సామర్థ్యం
అది ఎవరి చేతిలో ఉంది,
ఎవరి కోసం ఉద్దేశించబడింది
అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

- జోసెఫ్ స్టాలిన్

కృత్రిమ మేధస్సు - ఉద్యోగాలపై ప్రభావం

విశ్లేషణ

సంజయ్ రాయ్

నూతన సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తి ప్రపంచవ్యాపితంగా ఉద్యోగాలు ఊడిపోతాయనే ఆందోళనను పెంచింది. అభివృద్ధి చెందిన దేశాలు...ఒకే తరహాలో చేసే మధ్యంతర పనులన్నిటికీ కృత్రిమ మేధస్సు (ఎ.ఐ) సహాయంతో తెలివిగా ఆలోచించగల యంత్రాలను నింపేస్తున్నాయి. ఇంటర్‌నెట్ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్-ఐ.ఓ.టి) కూడా ఇందుకు కారణమవుతున్నది. ఎ.ఐ, ఐ.ఓ.టి, బిగ్ డేటా, బ్లాక్ చైన్, 5జి, 3డి ముద్రణ, రోబోటిక్స్, డ్రోన్లు, జన్యు ఎడిటింగ్, నానో టెక్నాలజీ, సౌర పరిజ్ఞానం వంటి వాటితో నూతన విప్లవం వచ్చేస్తున్నది. ఆయా దేశాల సాంకేతిక పునాది, అన్వయించుకునే సామర్థ్యంపై ఆధారపడి వివిధ దేశాలలో ఇవి వివిధ దశల్లో వున్నాయి.



> ఇప్పుడు నూతన సాంకేతికత వల్ల ఆదా అవుతున్న సమయం, సదుపాయాలు అందరికీ దక్కడం లేదంటే ప్రస్తుత పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలే అందుకు కారణం. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం గల కొద్ది మంది దాన్ని అనుభవించగలుగుతున్నారు. మిగిలిన వారు పనులు కోల్పోతున్నారు. సాంకేతికత వారి పని సమయం తగ్గించకపోగా పనులు పోగొట్టి బజారులోకి నెడుతున్నది. పనుల్లో వున్నవారు కూడా ఎక్కువ గంటలు ఎక్కువ శ్రమ చేస్తూ భద్రత కోల్పోతున్నారు. ఎందుకంటే పెట్టుబడిదారులు సహజంగానే కొత్త పరికరాల కోసం వ్యయించిన మొత్తం వెనువెంటనే తిరిగి రాబట్టుకోవాలని ఆరాటపడతారు. కనుక పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల కారణంగానే నూతన సాంకేతికత ఉద్యోగాల పెంపుదలకు దారితీయడం జరగదు.

సాంకేతిక ప్రక్రియలు ప్రకృతి క్రమాన్ని విచ్ఛిన్నం చేస్తాయి. సాధారణంగా ఉన్న ఉత్పత్తి క్రమాన్ని తీవ్రంగా మార్పుకు లోను చేస్తాయి. తద్వారా ధరలనూ ప్రభావితం చేస్తాయి. సాంకేతిక పరిజ్ఞానం మానవ శ్రమను తగ్గించి వేయడం ద్వారా శ్రామికులకు పని లేకుండా చేయడానికి సహజంగా ఉపయోగిస్తుంటారు. అయితే అదే సమయంలో అందుకోసం కొత్త యంత్రాలను, విడి భాగాలనూ తయారు చేయాలి. మానవులు ఆ నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి. కనుక సాంకేతిక పరిజ్ఞానంపై కీలక ప్రశ్న ఒక్కటే. నికరంగా ఉపాధిపై ఎలాంటి ప్రభావం పడుతుంది? కొత్త తరం సాంకేతికత గనక సాధారణ ప్రయోజనం గలదే అయితే (ఉత్పత్తి వివిధ దశలపై ప్రభావం చూపేదే అయితే) దాని ప్రభావం మరింత విచ్ఛిన్నకరమవుతుంది. ఆ ప్రభావం పెరుగుతూ పోతుంది. నేటి సమాజంలో కొద్ది మంది సూపర్ ధనవంతులు మినహా ప్రతివారూ తమ శ్రమశక్తిని అమ్ముకోవడంపైనే ఆధారపడి బతికే వారు అయినప్పుడు ఈ ప్రభావం మరింత భయానకంగా తయారవుతుంది. వారు నిపుణత గలవారైనా కాకపోయినా ఉద్యోగాలు పోతాయనేది ఒకే విధంగా భయపెడుతుంది.

మానవ శ్రమను తగ్గించడమంటే అది నిరుద్యోగానికి పర్యాయపదంగా మారుతుంది. జనాభాలో పెద్ద భాగానికి ఆదాయం లేకుండా పోతుంది. పనిలో ఉన్నవారికి కూడా తమ నిపుణతలు కొత్తగా మార్చుకోవలసి వస్తుంది. ఆ విధంగా వారు అవసరం లేని సజ్జుగా మార్చివేస్తుంది. మానవులకూ వారు సృష్టించిన వాటికీ (నిర్జీవ సజీవ శ్రమల) మధ్య ఘర్షణ మరోసారి ప్రజ్వరిల్లుతుంది. నూతన సాంకేతిక పరిజ్ఞానం వెల్లువలా వచ్చేస్తున్న నేటి నేపథ్యంలో ఇది మరోసారి విజృంభిస్తున్నది.

నిరంతర ప్రక్రియే ఇది

శ్రామిక శక్తితో పోలిస్తే ఉత్పాదకత నిరంతరాయంగానూ వేగంగానూ పెరగడం పెట్టుబడిదారీ వ్యవస్థలో స్వత:సిద్ధమైన ధోరణి. మరో విధంగా చెప్పాలంటే నిరుద్యోగం పెంచడం దాని లక్షణం. పనులు కోల్పోయిన ఈ నిరుద్యోగులే వేతనాలు పెరగకుండా ఒక రిజర్వు ఆర్మీగా అందుబాటులో వుంటారు. శ్రామిక ప్రక్రియకు అడ్డుకట్ట వేసే ఒక క్రమశిక్షణా శక్తిగా నిరుద్యోగం పనిచేస్తుంది. అయితే పరిశోధన, సాంకేతికత ద్వారా ఉత్పాదకత పెరుగుదల ఏ మేరకు వాస్తవ రూపం దాలుస్తుందనేది పెట్టుబడిదారీ విధానంలో ఎప్పుడూ ఒక క్రమపద్ధతిలో వుండదు. వాస్తవానికి అదొక ఆకస్మికమైనదిగా ఉన్నఫళాన జరిగిపోతుంటుంది. ప్రతి పెట్టుబడిదారుడూ కొత్త యంత్రాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టాలని చూస్తుంటాడు. ఆ నిర్ణీత పారిశ్రామిక రంగంలో సగటు లాభం రేటు కన్నా అధికంగా ప్రీమియం గడించాలనేదే తన ఆలోచనగా వుంటుంది. అదే ససాంకేతిక కౌలు. క్రమంగా ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానం సగటు స్థాయికి చేరేసరికి ఉత్పత్తిదారునికి వస్తున్న అదనపు ప్రయోజనం వినిమయదారునికి బదలాయించబడుతుంది. దిగువ విభాగాల్లో సగటు రేటు తగ్గుతుంది. ఇది మళ్లీ ఒక కొత్త రకం అన్వేషణకు కారణం అవుతుంది.

అయితే సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఉత్పాదకతలో పెరుగుదల ప్రతిసారీ నిరుద్యోగం పెరుగుదలకు దారితీస్తుందని చెప్పడానికి లేదు. కొన్ని కొత్త యంత్రాలు ఉన్న కార్మికుల తొలగింపునకు కారణం కావచ్చు. కానీ యంత్రాల ఉత్పత్తి, వాటి విడిభాగాలు మౌలిక వసతుల తయారీ, వాటి రవాణా వ్యవస్థ నూతన అవకాశాలు కూడా కల్పించవచ్చు. కనుక యంత్రాల వినియోగం వల్ల కలిగే మొత్తం ఫలితం ఎలా వుంటుందనేది ఒక రంగంలో ఉత్పాదకత పెరుగుదల, దాని గొలుసుకట్టు ప్రభావాలు కొత్త సరుకులు, సర్వీసుల కోసం అది సృష్టించే గిరాకీపై ఆధారపడి వుంటుంది. ఉత్పాదకత పెరిగే కొద్దీ అన్ని స్థాయిల్లోనూ ఉత్పత్తిపై ప్రభావం పడి ధరలు తగ్గుతాయనీ నిజమైన ఆదాయాలు పెరుగుతాయనీ మామూలుగా అనుకుంటుంటారు. ఆ కారణంగా ప్రజలు ఆ వస్తువులే మరిన్ని కావాలని కోరుకుంటారనీ లేదా కొత్త తరహాలో వస్తున్న సరుకుల కోసం ఇష్టపడతారనీ వీటన్నిటివల్ల ఉద్యోగాలు పెరుగుతాయనీ అనుకుంటారు. అయితే ఈ వాదనలో కీలకమైన కొన్ని లింకులుంటాయి. నూతన సాంకేతిక పరిజ్ఞానం తగినంత స్థాయిలో అందుబాటులోకి రావాలి. దీనివల్ల కలిగే ఉత్పాదకత పెంపు నూతన సరుకుల కోసం గిరాకీ పెంచేదై వుండాలి. తద్వారా కొత్త పెట్టుబడుల రాకకు దారితీయాలి. అందువల్ల అర్థం చేసుకోవలసిందేమంటే సాంకేతిక అభివృద్ధి ఉత్పాదకత పెరుగుదలకు దారితీసినప్పటికీ ఆ ప్రయోజనాలు కొంతమందికే లాభాలుగా ఆగిపోయేట్టయితే అప్పుడు పరిస్థితి వేరుగా వుంటుంది. అదనపు వేతనాలు జీతాల రూపంలో పంపిణీ కాకపోతే మరిన్ని సరుకులు, కొత్త సరుకుల కోసం గిరాకీ పెరగకపోవచ్చు. ఈ కొత్త యంత్రాల వల్ల ఉనికి కోల్పోయిన శ్రామిక శక్తిని ఇముడ్చుకోగలిగిన స్థాయిలో గిరాకీ పెరగకపోతే ప్రయోజనం వుండదు. శ్రమ ఉత్పాదకతకూ నిజమైన వేతనాల పెరుగుదలకు మధ్యన అంతరం పెరిగేట్టయితే అప్పుడు కొత్తగా పెరిగే విలువలో వేతనాల వాటా పడిపోవడానికి కారణమవుతుంది. ఈ రోజున ప్రపంచంలో జరుగుతున్నదదే. దీనివల్ల గిరాకీ పెరుగుదల అవకాశం, తద్వారా ఉద్యోగాలు తగ్గిపోతాయి.

ఉత్పాదకత పెరిగినా...

ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఏ విభాగాల్లో ఉపయోగించబడుతున్నదనే దానిపై కూడా ఆ ప్రభావం ఆధారపడి వుంటుంది. ఉత్పాదకత పెరుగుదల, తత్ఫలితంగా ధరల తగ్గుదల అనేది ఎల్లప్పుడూ గిరాకీలో అంతే పెరుగుదలకు దారితీయకపోవచ్చు. ఉదాహరణకు ఆహార విభాగంలో ఉత్పాదకత పెరిగి ధరలు పడిపోతే అదే నిష్పత్తిలో ఆహారానికి గిరాకీ పెరగదు. ఇతర వస్తువుల విషయం వేరే వుంటుంది. అలాగే జనాభాలో పెద్ద సంఖ్య పేదలు వుంటే ధరలు పడిపోయినా అది తప్పక గిరాకీ పెరుగుదలకు కారణం కాజాలదు. అదే విధంగా ఏ సరుకుల విషయంలోనైతే కావలసినంత అందుబాటు వుండి దాదాపు ఇక చాలనే స్థితి వచ్చిందో ఆ రంగాలలో కూడా ధరల తగ్గుదల ప్రభావం వుండదు.

అందువల్ల సాంకేతికత అభివృద్ధి గిరాకీని తద్వారా ఉద్యోగావకాశాలను ఏ మేరకు పెంచుతుందనేది వినియోగం, ప్రభావం అనే అంశాల పొందికపై ఆధారపడి వుంటుంది. శ్రామికుల వినియోగం, ఖర్చు ఎక్కువగా వుండేచోట వారి అవసరం తగ్గించే సాంకేతికత ఎక్కువ ప్రయోజనకరం. సాధారణంగా వేతనాలు ఎక్కువగా వుండే విభాగాలలో కూడా ఇది లాభదాయకం. ఎందుకంటే దానివల్ల ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. కానీ ఇప్పటికే వేతనాల ఖర్చులు తక్కువగా వుండే చోట సాంకేతికతతో వ్యయం తగ్గుదల ఎప్పుడూ జరగకపోవచ్చు. కాకుంటే శ్రామికులను నియంత్రణలో వుంచుకోవడానికి మాత్రం ఉపయోగపడొచ్చు. అసలు ఉత్పత్తిదారులు కూడా ఏదో శాస్త్రీయంగా సమర్థవంతమైందనే ఒకే కారణంతో నూతన సాంకేతికతను తెచ్చిపెట్టుకోరు. పాత సాంకేతికతను మార్చి కొత్తది స్థాపించుకోవడానికి పెట్టే ఖర్చుపై వచ్చే ఆదాయం (కౌలు) చాలా చాలా ఎక్కువగా వుండేట్టయితేనే వారు కొత్త సాంకేతికతకు సిద్ధపడతారు. కనుక నూతన సాంకేతికత ఎంత వేగంగా వ్యాప్తి చెందుతుందనే దాన్నిబట్టి ఉద్యోగాలపై ప్రభావం ఆధారపడి వుంటుంది.

ఉద్యోగాల పెంపు ఒట్టిదే

సాంకేతిక పరివర్తన ప్రస్తుత దశలో ఉద్యోగాల పెరుగుదలపై సానుకూల ప్రభావం పడుతుందని అంటే పెరుగుదల వుంటుందని ఆశించడం దుస్సాధ్యం. ఇందుకు కారణం కేవలం ఆ సాంకేతికత స్వభావం ఒక్కటే కాదు. అది అమలులోకి వస్తున్న సామాజిక సందర్భమే అందుకు ప్రధానంగా కారణమవుతుంది. ఉత్పాదకత పెంపు వల్ల కలిగే లాభాలు విస్తృతంగా పంపిణీ అయ్యే అవకాశాలు తక్కువగా వున్నాయి. నయా ఉదార విధానాల వల్ల ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయి. ప్రస్తుత పాలనా వ్యవస్థ యథాతథంగా కొనసాగేట్టయితే ఆ పోకడలు మారే అవకాశాలు దాదాపు శూన్యం. ప్రపంచ వ్యాపితంగా జిడిపి పెరుగుదలలో కార్మికుల వాటా వరుసగా తగ్గిపోతున్న పరిస్థితి ప్రతిబింబిస్తున్న వాస్తవం అది. ఇరవయ్యవ శతాబ్దంలో పెట్టుబడిదారీ విధానం సోషల్ డెమోక్రటిక్ సంక్షేమ పాలన తీసుకురావడం ద్వారా ఆర్థిక అసమానతలతో రాజీ పడింది. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు వేతనాలు లాభాల వాటా స్థిరంగా కొనసాగింది. అంటే ఉత్పాదకతలో వచ్చిన లాభాలు కొంతవరకైనా దామాషా పద్ధతిలోనైనా పంపిణీ అయ్యాయి. కానీ నయా ఉదారవాద విధానాలు ఈ పరిస్థితిని పూర్తిగా కిందామీదు చేశాయి. రెండో విషయమేమంటే ప్రస్తుతం సాంకేతిక పరివర్తనలో వైజ్ఞానిక వనరుల వాటా పెద్దదిగా వుంటోంది.వాటిని సంప్రదాయికంగా గానీ సహజంగాగానీ పొందడం సాధ్యం కాదు. గతంలో వచ్చిన పారిశ్రామిక విప్లవాల సమయంలో వ్యవసాయ పనులు చేసే వారిని కొద్దిపాటి శిక్షణతో కర్మాగారాల్లో కార్మికులుగా మార్చుకోవడం సంభవించింది. అదే ఇప్పుడు చూస్తే సాంకేతికత సరిహద్దులు మహా వేగంగా మారిపోతున్నాయి. ఈ నూతన సాంకేతికపై పనిచేయాలంటే అవసరమైన పని చేసేవారు అవసరమైన విద్య నైపుణ్యాలతో మాత్రమే సాధ్యమవుతుంది. అంటే వారు సంప్రదాయ పద్ధతులలో ఈ పని చేయడం సాధ్యపడదు. ఉదాహరణకు మీ పొలం దున్నాలన్నా, విత్తనాలు నాటాలన్నా కూడా కొంత నైపుణ్యం కావలసే వుంటుంది. అయితే ఆ నైపుణ్యాలు ఎలాంటి అదనపు ఖర్చు లేకుండానే తరతరాలుగా సంక్రమిస్తున్నవే. కానీ ఐసిటి, ఎ.ఐ వంటి వాటి విషయం వేరు. బాగా ఖర్చు పెట్టకుండా ఆ యంత్ర పరికరాలనూ ప్రక్రియలనూ నిర్వహించడం కుదిరే పని కాదు. విద్య, శిక్షణ అనేవి ప్రైవేటీకరణతో అంతకంతకూ సరుకులుగా మార్చివేయబడుతున్నాయంటే దానివల్ల భవిష్యత్తులో శ్రామికశక్తిగా వుండాల్సిన జనాభాలో పెద్దభాగం వాటికి దూరమవుతారు. అంతిమంగా చెప్పాలంటే సాంకేతిక పరిజ్ఞానం ప్రక్రియలు ప్రస్తుతం జరుగుతున్న పనిలో మానవ శ్రమను తగ్గించి వారికి మిగులు సమయాన్ని లేదా స్వేచ్ఛగా గడపగల సమయాన్ని పెంచేవిగా వుండాలి. కానీ ఇప్పుడు నూతన సాంకేతికత వల్ల ఆదా అవుతున్న సమయం, సదుపాయాలు అందరికీ దక్కడం లేదంటే ప్రస్తుత పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలే అందుకు కారణం. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం గల కొద్ది మంది దాన్ని అనుభవించగలుగుతున్నారు. మిగిలిన వారు పనులు కోల్పోతున్నారు. సాంకేతికత వారి పని సమయం తగ్గించకపోగా పనులు పోగొట్టి బజారులోకి నెడుతున్నది. పనుల్లో వున్నవారు కూడా ఎక్కువ గంటలు ఎక్కువ శ్రమ చేస్తూ భద్రత కోల్పోతున్నారు. ఎందుకంటే పెట్టుబడిదారులు సహజంగానే కొత్త పరికరాల కోసం వ్యయించిన మొత్తం వెనువెంటనే తిరిగి రాబట్టుకోవాలని ఆరాటపడతారు. కనుక పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల కారణంగానే నూతన సాంకేతికత ఉద్యోగాల పెంపుదలకు దారితీయడం జరగదు. మానవ మేథ సష్టి అయిన సాంకేతికత ఆ మానవాళి శ్రేయస్సుకే నష్టదాయకమవడం ఇక్కడ వైపరీత్యం! ★

ప్రజాకళ ప్రాణం ప్రజాస్వామ్యం

సందర్భం

కె. శాంతారావు

కళ స్వేచ్ఛను కోరుకుంటుంది. దుర్మార్గాన్ని, దౌర్జన్యాన్ని ధిక్కరిస్తుంది. కళ స్వభావమే అంత. అందుకే చీకటిలో పాటలు ఉంటాయా..? అంటే చీకటిని చీల్చేందుకే పాట పుట్టిందని జర్మన్ కవి బ్రెక్ట్ జవాబిస్తాడు.

జానపద కళలు అనాదిగా ఈ స్వభావం నుండే జనపదాల నుండి జనం మధ్యన అసంఖ్యాకంగా పుట్టుకొచ్చాయి. పుట్టుకొస్తాయి కూడా ఇక ముందు.

మార్క్సిజం-లెనినిజం సైద్ధాంతిక భూమికపై చారిత్రక భౌతికవాదం ఆవిష్కృతమైనాక, కళ పుట్టుక-పరిణామం కూడా ఓ శాస్త్రీయ సిద్ధాంతంగా అవగతమైంది. ఇప్పుడు ఈ అవగాహన జగిద్విదితం. అనుసరణీయం. 'కళ పూర్వజన్మ సుకృతం, కళ దైవదత్తం' అనే అశాస్త్రీయ భావాలకు కాలం చెల్లింది. వర్గ దోపిడీ సమాజంలో కళ కూడా అనివార్యంగా రెండుగా చీలిపోతుంది. దోపిడీ వ్యవస్థను బలపరిచేది ఒకటైతే, ప్రజా విముక్తికై పాటుపడేది మరొకటి.

ఒకనాటి ఫ్యూడల్ వ్యవస్థలో ప్రభువుల ఆస్థాన అంత:పురాలకు, ఉన్నత వర్గాల రాచకేళీ విలాసాలకు ఓ కళ పరిమితమైతే, జనావాసాలకు, జానపథాలకు జానపద కళ రంగభూమైంది.

ఇరవయ్యవ శతాబ్దం సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థల దశలో ప్రపంచం రెండు ప్రపంచ యుద్ధాలను చవిచూసింది. 1914-19 మొదటి ప్రపంచయుద్ధం. 1939-44 రెండవ ప్రపంచ యుద్ధం. ఈ రెండవ ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది ప్రజానీకం బలైపోయారు. నాజీ నరహంతక హిట్లర్ ఫాసిస్ట్ యుద్ధోన్మాద దాడికి ఒక సోవియట్ దేశంలోనే రెండు కోట్ల మందికి పైగా ప్రజలు హతులయ్యారు.

1945 ఆగస్టు 6, 9 తేదీలలో అమెరికన్ సామ్రాజ్యవాదం అమానుషంగా వేసిన అణుబాంబులకు జపాన్ నగరాలు హిరోషిమా, నాగసాకి ప్రజలు లక్షలాది మంది నేలకొరిగారు. ఆ విష పదార్థాల ప్రభావానికి ఇప్పటికీ ఆ ప్రజలు బాధలు అనుభవిస్తూనే ఉన్నారు.

ఈ నేపథ్యంలో విశ్వశాంతి కాంక్ష ఎల్లెడలా పరుచుకున్నది. తిండి, బట్ట, వసతి వంటి కనీస అవసరాలతో పాటు శాంతి-సామరస్యం కూడా ఓ ప్రాథమిక అవసరంగా తోసుకు వచ్చింది. దేశాధినేతలు ఎవరైనా సరే శాంతి కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలనే డిమాండ్ ప్రజా హృదయాల్లో పెల్లుబికింది. ఈ క్రమంలోనే మానవుడే నా సందేశం అని, శాంతి-సమభావం-సమిష్టి క్షేమం ఆధునిక యుగ ధర్మాలని మహాకవి శ్రీశ్రీ వంటివారు ఉద్ఘాటించారు.

సెప్టెంబర్ 8 డా॥ రాజారావు 60వ వర్ధంతి

భౌతికంగా మనిషి సుఖదు:ఖాలకు, కష్టనష్టాలకు మనిషే కారకుడు తప్ప దేవుడు కాదని మార్క్సిజం తేల్చి చెప్పింది. దేవుని పేరిట (ఇన్ ది నేమ్ ఆఫ్ గాడ్) చరిత్రలో జరిగిన, జరుగుతున్న ఘోర కృత్యాలకు, ఊచకోతలకు ఉన్మాదపూరితుడైన మృగం లాంటి మనిషేనని విశదపరిచింది. ఈ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాల దోపిడీ మార్కెట్ల కోసమే యుద్ధాలు జరుగుతాయని వివరించింది. అయితే ఈ దుర్మార్గాలను ఎప్పటికైనా ప్రజలు సంఘటితంగా సమరశీల పోరాటాలతో తిప్పికొడతారని తెలిపింది. అదో చారిత్రక విశ్వాసంగా దార్శనికతతో ప్రకటిస్తూ 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అన్న సత్యాన్ని చాటి చెబుతుంది.

ఈ సైద్ధాంతిక భూమికను అందిపుచ్చుకున్న ఎందరో ప్రజా కళాకారులు అద్భుతమైన సాహితీ కళాకృతులను సృష్టించారు. ఆ విప్లవ భావ చైతన్యాన్ని రంగరించి తమ కృతుల్లో నింపడమే గాక, ప్రజల్ని అలా వర్గభావ చైతన్యులను గావించేందుకు అహరహం శ్రమించారు. ప్రాణాలను, జీవితాలను ధారపోశారు.

ఈ మార్గంలో ఎన్నో జానపద కళలు ప్రజా కళలుగా రూపాంతరం చెందాయి. ఎందరో ప్రజా కళాకారులు తమ జీవితాలను కళలకే అంకితం చేశారు. అలాంటి వారిలో డాక్టర్ గరికపాటి రాజారావు తెలుగునాట ముందు పీఠిన నిలుస్తారు.

ప్రజా కళాతపస్విగా, ప్రజా రంగస్థల ప్రయోక్తగా డాక్టర్ రాజారావు గణతికెక్కడం, ఈ మార్గాన పయనించడం వల్లనే సాధ్యమైందని రాజారావు సహచరులు కాకరాల వక్కాణిస్తారు.

కళారూపం ఏదైనా, రచయిత ఎవరైనా ప్రదర్శనకు ప్రాణం ప్రయోక్త. ప్రాణం ఎక్కడ ఉంటుంది? అణువణువున ఉంటుంది. దాని ఉనికికి గుర్తు ఊపిరి. అది స్పర్శతో అనుభూతమవుతుంది. కానీ కంటికి కనిపించదు. ప్రదర్శనకు ప్రాణమైన ప్రయోక్త కూడా అంతే. ఆ చారిత్రక నేపథ్యంలో జన్మించిన రాజారావు ఆ విధంగా ప్రజా కళారంగంలో ఎనలేని కృషి చేశారు. ఎన్నెన్నో ప్రయోగాలకు ఒరవడి దిద్దారు.

హిట్లర్ బాగోతంలో ఎర్ర సైనికునిగా, మా భూమి, సీతారామరాజు వంటి సాంఘిక చారిత్రక నాటకాల దిగ్దర్శకునిగా, 'పుట్టిల్లు' సినిమాకు చిత్ర దర్శకునిగా డాక్టర్ రాజారావు కృషి అనుపమానం.

ప్రతి ప్రజా కళాకారునికి నాలుగు లక్షణాలు మెండుగా ఉండాలి. 1. వేదన. వర్గ సమాజంలో బాధితుల వేదనతో కళాకారుడు మమేకం కావాలి. సహానుభూతి (ఎంపథీ) చెందాలి. 2. శోధన. బాధితుల సమస్య పరిష్కారానికై ఓ కళాకారునిగా తాను ఏం చేయగలనో శోధించుకుని ఆ దిశగా అడుగేయాలి. రాసేవారు రాయాలి. పాడేవారు పాడాలి, ఆడేవారు ఆడాలి. ఆ రాత, ఆట, పాట, మాట నవ్యంగా, నాణ్యంగా ఉండాలి. అందుకు సాధన అవసరం. 3. సాధన. ఆ నిత్య సాధనలోనే కళా నైపుణ్యం పెరుగుతుంది. ఆ రూపానికి ఆకర్షణా శక్తి అబ్బుతుంది. ప్రజల కోసం కఠోర దీక్షతో ఈ సాధన చేయాల్సిందే, మినహాయింపు లేదు. 4. ప్రదర్శన. సాధన తర్వాత మాత్రమే ప్రజల్లో ప్రదర్శనకు వెళ్ళాలి. అలా చిత్తశుద్ధితో ప్రదర్శనలకు వెళ్ళినప్పుడు ప్రజలు ఆ కళారూపాలకు బ్రహ్మరథం పడతారు. ఆ కళారూపం ప్రజలను కదిలించే ఓ చైతన్య స్వరూపంగా మారుతుంది. ప్రజా కళాకారులకు ఇది అనుభవ సత్యమే.

డాక్టర్ రాజారావు ఈ నాలుగు లక్షణాలను పుణికిపుచ్చుకుని ఆదర్శప్రాయంగా నిలిచాడు. ప్రదర్శన నిర్మాణ బాధ్యతంతా ప్రయోక్తదే. తెర ముందు కంటే తెర వెనుక కృషి అధికం. కార్యక్రమ లేదా కర్తవ్య పథ నిర్దేశకుడు అతనే. ఆఖరికి నిరాకార నిరంజనుడుగా మిగిలిపోక తప్పదు. ఆ విధంగా కనిపించని కళా ప్రవక్త ఈ ప్రయోక్త.

డాక్టర్ రాజారావు ఈ కారణాన కేవలం ఓ కళాకారుడిగా మాత్రమేగాక ఓ సాంస్కృతిక కార్యకర్తగా (కల్చరల్ ఆర్గనైజర్‌గా) ప్రజా కళకు బాటలు వేశాడు.

1943లో బొంబాయిలో భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభలు జరుగుతున్న తరుణంలోనే ఆలిండియా పీపుల్స్ థియేటర్ అసోసియేషన్-ఇప్టా ప్రథమ మహాసభలు జరిగాయి. ఆ మహాసభలు ద్విముఖ లక్ష్యాన్ని ప్రకటించాయి. 1. ఫాసిస్టు ప్రమాదాన్ని ప్రతిఘటించడం 2. అంతర్జాతీయ శ్రామిక వర్గ దృక్పథాన్ని కలిగి ఉండటం.

ఇప్టా కేంద్ర కమిటీకి ఆంధ్ర ప్రాంతం నుండి కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన రాజారావు ఆ లక్ష్య సాధనకు అహర్నిశలూ శ్రమించాడు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాడు. 1963 సెప్టెంబర్ 8న అస్వస్థతతో అస్తమించాడు.

రాజారావు ఓ ఉద్యమం నుండి పుట్టాడు. అందులో నాటకరంగం ఒకటి. రాజారావు ప్రజానటుడు. ప్రజా నాటకాలు నాటకరంగంలో తెచ్చిన పరిణామం విప్లవ పరిణామం అనడానికి ఎలాంటి సందేహం లేదు.

'ప్రసిద్ధ నాటకాలు అన్నీ ప్రజా నాటకాలు కావు. గొప్ప నటులని చెప్పుకునే మహానటులందరూ ప్రజా నటులు కారు. ప్రజా నాటకాలు ఎలా ప్రదర్శించినా జనం చూసి ఉండేవారే కానీ, వాటిలో నాటక శిల్పం, నటనా శిల్పం ఉన్నతంగా ఉంచడానికి రాజారావు చేసిన కృషి, పడిన శ్రమ మరువరానిది. అతను నాటక కళకి ఉద్యమానికి సమన్వయం సాధించడానికి తన బుద్ధిని నిర్దాక్షిణ్యంగా ధారపోశాడు' అని కొడవటిగంటి కుటుంబరావు కొనియాడుతూ నివాళులర్పించారు.

ప్రస్తుతం మన దేశంలో అటు ఫాసిస్టు శక్తులు, ఇటు కార్పొరేట్ శక్తులు జమిలిగా దాడి చేస్తూ కష్టజీవుల హక్కులను, జీవితాలను కాలరాస్తుంటే, రాజ్యాంగ స్ఫూర్తిని ధ్వంసం చేస్తూ నియంతృత్వం వైపు అడుగిడుతుంటే ప్రజా కళాకారులు డాక్టర్ రాజారావు మార్గంలో పని చేయడమే ఏకైక శిరోధార్యం.

/ వ్యాసకర్త సెల్: 9959745723 /

జనవాక్యం

మెరుపు సమావేశాలు

ప్రభుత్వం ఆకస్మికంగా ప్రకటించింది. ఈ నెలలో ఐదు రోజుల ప్రత్యేక సమావేశాలు జరపబోతున్నట్టు. ఇప్పుడు సమావేశాలు హఠాత్తుగా ప్రకటించడం అంటే ఇంకా పెద్ద విషయమేదో ఉండొచ్చు అనిపిస్తుంది. అది కూడా పార్లమెంట్ తప్పనిసరిగా చర్చించాల్సిన విషయమే అనిపిస్తుంది. మనం కూడా మన ఊహాశక్తి మేరకు ఆలోచిస్తే మొదటిగా తట్టేది జమిలి ఎన్నికల అంశం. వాటికోసం పార్లమెంట్‌ని సమావేశ పర్చడం ఆవశ్యం. ఎందుకంటే తరువాత సమావేశాల కోసం నవంబర్ వరకూ ఆగితే ఆ తర్వాత సమయం చాలదు. ఈలోగా అదే మాసంలో ఎన్నికలకు వెళ్లాల్సిన రాష్ట్రాలు కూడా ఉన్నాయి. ఈరోజు ప్రభుత్వం జమిలి ఎన్నికల అంశం పరిశీలించడానికి మాజీ రాష్ట్రపతితో కమిటీ కూడా వేసింది.ఈ పది పదిహేను రోజుల్లో ఆ రిపోర్ట్ కూడా వచ్చేయొచ్చు. కాబట్టి అదో కారణం అనిపిస్తుంది. మరో ముఖ్యమైన అంశం. జమ్ము-కాశ్మీర్‌లకు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించే అవసరం. త్వరలో అలా చేస్తానని సుప్రీం కోర్టుకు ప్రభుత్వం తెలియబర్చింది. ఇవి కాకుండా మణిపూర్ అంశం, జీ20 సమావేశాలు పూర్తవ్వడం లాంటివి ఉన్నాయి. కానీ వాటికోసం ప్రత్యేక సమావేశాలు అవసరం అంతగా లేదు. ఎన్నికల అంశమే అసలు ఎజెండా అనిపిస్తోంది. ఎజెండా ఏదైనా గానీ ప్రతిపక్షాలు అదానీ అంశంపై పట్టుబట్టి నిలదీయడం తప్పదనిపిస్తుంది. అయితే ఇవన్నీ ఊహాగానాలు. అసలు విషయం అప్పుడే తెలియదు. అందరం వేచి చూడాల్సిందే. ఉత్కంఠత కావాల్సినంత.

-డా. డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

ఎడిటర్స్ గిల్డ్ జర్నలిస్టులకు సుప్రీం రక్షణ

న్యూఢిల్లీ : ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ)కి చెందిన సీనియర్ జర్నలిస్టులను మణిపూర్ పోలీసులు అరెస్టు చేయకుండా సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. ఈ మేరకు బుధవారం తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది. ఇజిఐ తరపున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ చీఫ్ జస్టిస్ బెంచ్ ముందు అత్యవసరంగా ఈ అంశాన్ని మౌఖిక ప్రస్తావన తెచ్చారు. ఈ నెల 2న నివేదిక విడుదలైన తరువాత మణిపూర్ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తమకు తెలిసిందని పేర్కొన్నారు. ఆగస్టు 7 నుంచి 10వ తేదీ మధ్య ఇజిఐ ప్రెసిడెంట్ సీమా ముస్తఫా, సంజయ్‌కపూర్, సీమ గుహ, భరత్‌భూషణ్‌లతో కూడిన నిజ నిర్ధారణ బృందం మణిపూర్‌లో విస్తృతంగా పర్యటించిందని తెలిపారు. బాధితులు, ప్రత్యక్ష సాక్షులతో ఇంటర్వ్యూలు చేసి నివేదిక తయారు చేసిందని దివాన్ తెలిపారు. ఇజిఐ ఉద్రేకాలు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తోందంటూ మణిపూర్ సిఎం బీరేన్‌సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో నివేదికను ఇచ్చినందుకు వారిపై కేసులు నమోదు చేసిన మణిపూర్ పోలీసులు అరెస్టు చేయాలని భావించారని న్యాయవాది దివాన్ తెలిపారు.

సవివరమైన విచారణ కోసం ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా వారిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మణిపూర్ పోలీసులను ఆదేశించింది. మణిపూర్ పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలన్నీ అవాస్తవమని, తప్పుడు ప్రకటనలని ఎడిటర్స్ గిల్డ్ ఇండియా విమర్శించింది.

మీడియా స్వేచ్ఛకు సామూహిక రక్షణ అవసరం
జి-20 దేశాల సంపాదకులు, జర్నలిస్టులు

ఈ నెల 9, 10 తేదీల్లో జి-20 వార్షిక సదస్సు జరుగుతున్న నేపథ్యంలో జి-20 దేశాలకు చెందిన సంపాదకులు, జర్నలిస్టులు బుధవారం ఇక్కడ ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా మీడియా ఎదుర్కొంటున్న సవాళ్లు, ఆయా దేశాల్లో, ప్రాంతాల్లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వేధింపులు, అణచివేత చర్యలపై వారు చర్చించారు. జి 20 సభ్య దేశాల్లో మీడియా స్వేచ్ఛకు గల ప్రాముఖ్యతను సమావేశం నొక్కి చెప్పింది. రాబోయే రెండు రోజుల్లో నేతలు తమ చర్చల్లో కూడా ఈ అంశాలను చర్చించాలని సమావేశం కోరింది. మీడియా స్వేచ్ఛను పరిరక్షించుకోవడమనేది ఇప్పుడు చాలా కీలకమని సమావేశం అభిప్రాయపడింది. జి-20 దేశాల్లో, మొత్తంగా ప్రపంచవ్యాప్తంగా మీడియా స్వేచ్ఛకు సామూహిక రక్షణ అవసరమని పేర్కొంది. భారత ప్రభుత్వ అణచివేత విధానాల కారణంగా ఈ సమావేశాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సి వచ్చింది.

ఒకే దేశం- ఒకే ఎన్నికలకు సిద్ధం

- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్

భోపాల్ : చట్టపరమైన నిబంధనలు అనుసరించి 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు'కు సిద్ధంగా ఉన్నామని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ బుధవారం వెల్లడించారు. ఈ ఏడాది చివరిలో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించడానికి ఆ రాష్ట్రంలో ఎన్నికల కమిషనర్లు అనుప్ చంద్ర పాండే, అరుణ్ గోయెల్‌తో రాజీవ్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో రాజీవ్ కుమార్ మాట్లాడారు. ఒకే దేశం - ఒకే ఎన్నికలు గురించి ప్రశ్నించగా, చట్టపరమైన నిబంధనలు అనుసరించి అంటువంటి ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ సిద్ధంగా ఉందని తెలిపారు. 'చట్టపరమైన విధానాలు, రాజ్యాంగం, ఆర్‌పి చట్టం ప్రకారం అలాంటి ఎన్నికలను నిర్వహించడానికి మాకు ఆదేశాలు ఉన్నాయి. మేం సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు.

ఇండియా మార్పుపై మరో వివాదం

న్యూఢిల్లీ : వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే బిజెపి ప్రభుత్వం తాజాగా దేశం పేరు మార్పుపై కొత్త వివాదానికి తెరలేపింది. జి-20 సమ్మిట్‌కి పలువురు రాష్ట్ర ముఖ్యమంత్రులకు, నేతలకు రాష్ట్రపతి భవన్ పంపిన ఆహ్వాన పత్రికలో ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా పేరును కాస్తా.. ప్రెసిడెంట్ ఆఫ్ భారత్‌గా పంపిన సంగతి తెలిసిందే. ఇండియా పేరు మార్పుపై ప్రతిపక్ష నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆసియన్ - ఇండియా సమ్మిట్‌లో పాల్గొనమని ప్రధానమంత్రి మోడీకి పంపిన ఆహ్వాన పత్రికలో కూడా 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అనే పేర్కొనడం మరోసారి చర్చనీయాంశమైంది. ఆసియన్ -ఇండియా సమ్మిట్ మాత్రమే కాదు.. 18వ ఈస్ట్ ఏషియా సదస్సు ఆహ్వాన పత్రికలో కూడా ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అనే ఉంది. ఈ సదస్సుకు హాజరయ్యేందుకు మోడీ ఇండోనేషియాకు వెళ్లనున్నారు.

కొత్త భవనంలో పార్లమెంట్ సమావేశాలు..!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈనెల 18 నుంచి 22 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను కొత్త పార్లమెంట్ భవనంలోనే నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. సెప్టెంబర్ 18న పార్లమెంట్ పాత భవనంలో ఈ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అవుతాయని, వినాయక చవితిని పురస్కరించుకొని సెప్టెంబర్ 19 నుంచి ఈ సమావేశాలు కొత్త భవనంలోకి మార్చనున్నారని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. అయితే వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు కూడా కొత్త భవనంలోనే జరుగుతాయని తొలిత చెప్పినప్పటికీ, ఆ తరువాత పాత భవనంలోనే జరిగాయి.

ఉదయనిధి, ప్రియాంక్ ఖర్గేపై యుపిలో ఎఫ్ఐఆర్ నమోదు

న్యూఢిల్లీ : తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గేకు వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లో పోలీసు కేసు నమోదైంది. సనాతన ధర్మంపై ఉదయనిధి వ్యాఖ్యలు వివాదంగా మారిన తెలిసిందే. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే సమర్థించారు. దీంతో ఉదయనిధి స్టాలిన్, ప్రియాంక్ ఖర్గేలకు వ్యతిరేకంగా ఉత్తర ప్రదేశ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాష్ట్రంలోని రాంపూర్ సివిల్ పోలీసు లైన్స్ పోలీస్టే స్టేషన్‌లో సెక్షన్ 295ఏ (మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం), సెక్షన్ 153 ఏ (వివిధ మత గ్రూపుల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం) కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. న్యాయవాదులు హర్ష గుప్తా, రామ్ సింగ్ లోధి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఉదయనిధి స్టాలిన్ శనివారం తమిళనాడులో ఓ కార్యక్రమం సందర్భంగా సనాతన ధర్మంపై వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని డెంగీ, మలేరియా వ్యాధులతో పోల్చారు. తనపై చట్టపరమైన చర్యలు తీసుకున్నా, తన తల తెగనరికినా భయపడేది లేదని ఉదయనిధి వ్యాఖ్యానించడం గమనార్హం.

ప్యాకెట్‌లో బిస్కెట్ తక్కువైనందుకు వినియోగదారుడికి లక్ష పరిహారం

- ఐటిసి కంపెనీకి వినియోగదారుల కోర్టు ఆదేశం

చెన్నై : ప్రముఖ ఆహార ఉత్పత్తుల సంస్థ ఐటిసి తయారు చేసిన ఓ బిస్కెట్ ప్యాకెట్‌లో ఒక బిస్కెట్ తక్కువైనందుకు వినియోగదారుడికి రూ. లక్ష పరిహారం చెల్లించాలంటూ వినియోగదారుల కోర్టు తీర్పిచ్చింది. తిరువళ్లూర్ జిల్లాకు చెందిన ఢిల్లీబాబు ఐటిసి తయారు చేసిన సన్‌ఫీస్ట్ మేరీ లైట్ బిస్కెట్ ప్యాకెట్ కొన్నాడు. ప్యాకెట్‌లో 16 బిస్కెట్లు ఉంటాయని ర్యాపర్‌పై ముద్రించగా, లోపల 15నే కనిపించాయి. దీంతో, ఆయన వినియోగదారుల కోర్టును ఆశ్రయించాడు. కంపెనీ అన్యాయం చేస్తోందని, సేవల్లో లోపం ఉందని, కంపెనీపై రూ.100 కోట్ల పెనాల్టీ వేయాలని, ఆ ప్యాకెట్ అమ్మిన దుకాణం తనకు రూ.10 కోట్ల పరిహారం చెల్లించాలని కేసు దాఖలు చేశారు. బిస్కెట్ ప్యాకెట్‌లను వాటి బరువును బట్టి అమ్ముతామని, బిస్కెట్ల సంఖ్యను బట్టి కాదని ఐటిసి వివరించింది. కోర్టు ఐటిసి వాదనలను తోసిపుచ్చింది. ప్యాకెట్‌పై 16 బిస్కెట్లు ఉంటాయని ముద్రించినప్పుడు ఆ మేరకు ఉండాల్సిందేనని తీర్పు చెప్పింది. ఆ బిస్కెట్ ప్యాకెట్‌కు చెందిన బ్యాచ్ అమ్మకాలను మొత్తం నిలిపివేయాలని ఆదేశించింది. బాధితుడికి రూ. లక్ష పరిహారం చెల్లించడంతోపాటుకోర్టు ఖర్చుల కింద మరో రూ.10 వేలు ఇవ్వాలని తీర్పు చెప్పింది.

'ఇండియా' అంటే బిజెపికి ఎందుకంత భయం?

- దేశం పేరు మార్పును కేంద్రం తక్షణమే విరమించుకోవాలి : పినరయి విజయన్
- జమిలి ఎన్నికలపై ప్రజాస్వామ్య శక్తులన్నీ ప్రతిఘటించాలి

తిరువనంతపురం : 'ఇండియా' పదానికి బిజెపి ఎందుకు అంతగా భయపడుతుందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం ప్రశ్నించారు. దేశం పేరు మార్పు ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని విజయన్ డిమాండ్ చేశారు. "ఇండియా' అనే పేరును మార్చడం రాజ్యాంగానికి, దేశానికే విరుద్ధం. రాజ్యాంగంలో మొదటి ఆర్టికల్‌లో మన దేశం పేరును 'ఇండియా, ఇది భారత్'గా పేర్కొనారు. రాజ్యాంగంలోని పీఠిక యొక్క ప్రారంభం 'మేము, భారతదేశ ప్రజలు' అని ప్రారంభమవుతుంది' అని విజయన్ తెలిపారు. 'ఏ రాజకీయ ఎత్తుగడ కూడా దేశానికి వ్యతిరేకంగా ఉండకూడదు. ఇది అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధం. కాబట్టి దేశం పేరు మార్చే ప్రయత్నాలను కేంద్రప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలి' అని విజయన్ డిమాండ్ చేశారు.

మోడీ ప్రభుత్వం కోరుకుంటున్నట్లు ఒకే దేశం... ఒకే ఎన్నిక విధానం అమలైతే కేంద్రానికి అడ్డూ అదుపూ లేని అపరిమిత అధికారాలు కట్టబెడుతుందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలందరూ ముందుకు వచ్చి గళం విప్పాలని ఆయన కోరారు. బిజెపి ఆలోచన భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని ప్రజాస్వామ్య శక్తులన్నీ దీనిని గట్టిగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

'ఒకే దేశం... ఒకే ఎన్నిక సిద్ధాంతాన్ని ప్రజలపై రుద్దాలన్న సంఘ్ పరివార్ ప్రయత్నాలు దాని నీచమైన అజెండాను ప్రతిబింబిస్తున్నాయి. తన అధికారాన్ని పటిష్టం చేసుకునేందుకు సంఘ్ పరివార్ మన రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సంప్రదాయాలను ధ్వంసం చేయాలని చూస్తోంది. ఈ విషపూరిత ప్రయత్నాలను వ్యతిరేకించేందుకు మనమంతా సంఘటితం కావాలి. భారత రిపబ్లిక్‌కు పునాదిగా ఉన్న సూత్రాలను పరిరక్షించుకోవాలి' అని పినరయి 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆంక్షలకు తలవంచేందుకు నిరాకరించే రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరచి, ఆయా రాష్ట్రాలలో దొడ్డిదారిన అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అజెండాను సిద్ధం చేశారని విమర్శించారు. రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరు సమయాలలో జరుగుతాయని, దీనివల్ల పార్లమెంట్ ఎగువసభలో వివిధ పార్టీల బలాబలాలలో తేడా వస్తుందని తెలిపారు. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే రాజ్యసభ రాజకీయ వైవిధ్యం కనుమరుగవుతుందని వివరించారు.

ఈ సంవత్సరం చివరలో జరిగే ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతోనే బిజెపి హడావిడిగా జమిలి ఎన్నికలను తెరపైకి తెచ్చిందని పినరయి వ్యాఖ్యానించారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైతే రాబోయే లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రభావం పడుతుందేమోనని బిజెపి ఆందోళన చెందుతోందని తెలిపారు. సంఘ్ పరివార్ కోరుకుంటున్నట్లు దేశ ఎన్నికల వ్యవస్థను నాశనం చేయడానికి రాజ్యాంగం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య క్రమం అంగీకరించబోవని స్పష్టం చేశారు. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ వైవిధ్యాన్ని నాశనం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను దేశంలోని ప్రజాస్వామ్య శక్తులన్నీ ప్రతిఘటించాలని పినరయి విజయన్ పిలుపునిచ్చారు.

సనాతనవాదంపై ఉదయనిధి వ్యాఖ్యలకు ఘాటుగా బదులివ్వండి

- ఇండియా పేరు మార్పు వివాదంపై అతిగా స్పందించొద్దు
- మంత్రివర్గ సహచరులకు ప్రధాని మోడీ డైరక్షన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సనాతనవాదంపై వ్యాఖ్యలు చేసిన ఉదయనిధి స్టాలిన్‌కు ఘాటుగా బదులివ్వాలని ప్రధాని మోడీ తన మంత్రివర్గ సహచరులను ఎగదోశారు. అలాగే 'భారత్'పై ఆచితూచి మాట్లాడాలని సూచించారు. ఈ నెల8,9 తేదీల్లో జరిగే జి-20 శిఖరాగ్ర సమావేశ ఏర్పాట్లను సమీక్షించేందుకే బుధవారం నాడిక్కడ జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఆయన ఈ మేరకు ఆదేశించారు. విదేశీ ప్రతినిధులతో మాట్లాడేందుకు జి-20 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని మంత్రులకు సలహా ఇచ్చారు. వివిధ దేశాల నేతలు, ప్రతినిధుల సంభాషణలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకునేందుకు వీలుగా అన్ని భాషల్లోను యాప్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. జి-20 సమావేశానికి సంబంధించి ఒక వీడియోను మంత్రులకు చూపించారు. మంత్రులంతా తమ అధికారిక వాహనాలను పక్కన పెట్టాలని, ఎక్కువ మంది విఐపి వాహనాల్లో తిరిగితే ప్రోటోకాల్ సమస్యలు రావొచ్చనిఅన్నారు. అందుకే కేంద్ర మంత్రులు భారత్ మండపం, ఇతర వేదికల వద్దకు చేరుకోవడానికి బస్ సర్వీసులను వినియోగించాలని కోరారు.

కేరళ స్ఫూర్తితో బిజెపి ఓటమికి దేశవ్యాప్త ఐక్య ఉద్యమాలు

- మోడీని గద్దె దింపడమే లక్ష్యం
- అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్
- ఢిల్లీ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి విరాళాలు అందిస్తున్న కేరళ ప్రజలకు జేజేలు

తిరువనంతపురం : బడా కార్పొరేట్లకు వేలకోట్ల రాయితీ లిచ్చి పేదల సంక్షేమ పథకాలు వల్లనే దేశ అభివృద్ధికి ఆటంకం అని ప్రచారం చేస్తున్న మోడీని ఇంటికి సాగనంపే ఐక్య ఉద్యమాలను దేశవ్యాప్తంగా చేపడతామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తెలిపారు. కేంద్ర బిజెపి , ఆర్ఎస్ఎస్ విధానాలకు భిన్నంగా శ్రామిక ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేస్తున్న కేరళ వామపక్ష ప్రభుత్వం దేశానికి ఆదర్శం అన్నారు. ఢిల్లీలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, రైతు రైతు సంఘం కేంద్ర కార్యాలయ నిర్మాణానికి కొచ్చిన్ లో ప్రజల నుండి విరాళాలు సేకరించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నిధి వసూళ్లలో భాగస్వామి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 వేల ప్రాథమిక యూనిట్లు కలిగిన కేరళ రాష్ట్రంలో 26 లక్షల సభ్యత్వం ఉన్నది. ప్రతి ప్రాథమిక యూనిట్ నుండి 2000 రూపాయలు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి సభ్యుడు నుండి 20 రూపాయలకు తక్కువ కాకుండా ఆర్థిక సహాయాన్ని కోరుతున్నారు. భవిష్యత్తు ఉద్యమ నిధి , కార్యకర్తల అలవెన్స్ కోసం ఆర్థిక వనరులతో పాటు వ్యవసాయ కార్మికుల ఇండ్లలో ఉన్న పాత వస్తువులను సేకరించాలని కేరళ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుకు అనూహ్యమైన స్పందన వచ్చింది. ప్రతి వ్యవసాయ కార్మికుల తమ ఇళ్లలో ఉన్న పాత న్యూస్ పేపర్లు , మోటార్ సైకిళ్ళు, ఇనుప బీరువా లతోపాటు ఇతర వస్తువులను అందిస్తున్నారు. వీటి ద్వారా వచ్చిన నిధులలో నుండి కోటి రూపాయలను ఢిల్లీ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అందిస్తామని కేరళ రాష్ట్ర కమిటీ ప్రకటించటం హర్షించదగిన విషయం అన్నారు . మిగిలిన నిధులలో నుండి గ్రామ కమిటీకి కోటి రూపాయలు, ఏరియా కమిటీకి కోటి రూపాయలు, జిల్లా , రాష్ట్ర కమిటీలకు కోటి రూపాయలు ఉద్యమ అవసరాల కోసం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏ ఒక్క కుటుంబానికి ఆర్థిక భారం కాకుండా సభ్యులందరినీ భాగస్వామిని చేస్తూ ప్రజా ఉద్యమంగా నిధుల సేకరణ చేస్తున్నారు.

12 లక్షల కోట్ల రూపాయలను బడా కార్పొరేట్ కంపెనీలకు రాయితీలను ఇచ్చిన మోడీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు దేశ అభివృద్ధికి ఆటంకం అనడం సిగ్గుచేటని వెంకట్ విమర్శించారు. గ్రామీణ ఉపాధి పథకానికి గత బడ్జెట్లో నాలుగు శాతం నుండి 1.37శాతానికి నిధులను తగ్గించారు. ఆహార భద్రత చట్టానికి 2.80 వేల కోట్ల నుండి1.80 వేల కోట్లకు తగ్గించారు. దళితులు , గిరిజనుల సంక్షేమ నిధులను భారీగా కోత విధించారు. దీన్ని బట్టి మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రభుత్వం తప్ప పేదల ప్రభుత్వం కాదని అర్థమవుతున్నది. మోడీ అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేళ్ల కాలంలో పెద్ద ఎత్తున దళిత గిరిజన మహిళలపై హత్యలు అత్యాచారాలు జరుగుతున్న నోరు ఇవ్వడం లేదన్నారు.

గ్వాటెమాలా ఆధ్యక్షుడికి గుర్తింపు పత్రాలు అందజేత

గ్వాటెమాలా సిటీ : గ్వాటెమాలా అధ్యక్షులుగా బెర్నార్డో అరెవలోకు, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కరీనా హెరెరాకు గుర్తింపు పత్రాలను మంగళవారం సుప్రీం ఎలక్టోరల్ ట్రిబ్యునల్ (టిఎస్ఇ) అందజేసింది. ఇతర ప్రభుత్వ అధికారాలు ఎన్నికల అథారిటీపై దాడి చేయకుండా నివారించేందుకు సుప్రీం ఎలక్టోరల్ ట్రిబ్యునల్‌కి చెందిన న్యాయమూర్తులు పెట్టని కోటగా మారారని అరెవలో వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది జనవరి 14న కొత్త అధ్యక్ష, ఉపాధ్యక్షులు అధికార పగ్గాలు చేపట్టే వరకు తమ కార్యకలాపాలు కొనసాగుతాయని ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో వీరికి క్రెడెన్షియల్ పత్రాలను అందజేశారు. కుట్ర జరిగే ముప్పు వుందని హెచ్చరికలు వస్తున్నాయి. ఎన్నికైన నేతలు అధికారాన్ని చేపట్టకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో శాంతియుతంగా, చట్టబద్ధమైన అధికార మార్పునకు మద్దతునివ్వాల్సిందిగా అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు పుబెలా గ్రూపు ఒక ప్రకటనలో కోరింది.

పాక్‌లో దారుణం

- 45 మంది మహిళా ఉద్యోగులపై ప్రిన్సిపాల్ లైంగికదాడి

కరాచీ : పాకిస్థాన్‌లో ఒక ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ మహిళా టీచర్లపై సాగించిన లైంగిక అకత్యాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. టీచర్లను బెదిరించి, వారిపై లైంగికదాడులకు పాల్పడిన ఆరోపణలపై ప్రిన్సిపాల్ ఇర్ఫాన్ గఫూర్ మెమన్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రిన్సిపాల్ చేతిలో 45 మందికి పైగా మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. గఫూర్ ఫోన్ నుంచి 25 షార్ట్ వీడియో క్లిప్ లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీసీటీవీ కెమెరా డిజిటల్ వీడియో రికార్డర్, మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. ఓ మహిళా టీచర్ తో గఫూర్ ఏకాంతంగా ఉన్న ఒక వీడియో ఇంటర్నేట్‌లో కనిపించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ప్రిన్సిపాల్ గఫూర్ కు స్థానిక కోర్టు ఏడు రోజులు రిమాండ్ విధించింది.

ఎస్‌పిజి డైరెక్టర్ అరుణకుమార్ కన్నుమూత

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్రమోడీ భద్రతను పర్యవేక్షించే ప్రత్యేక భద్రతా బృందం (స్పెషల్ ప్రొటెక్షన్ బృందం) డైరెక్టర్ అరుణ్‌కుమార్ సిన్హా (61) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. గత కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అరుణ్‌కుమార్ గురుగ్రామ్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అరుణ్‌కుమార్ సిన్హా 1987 బ్యాచ్ కేరళ కేడర్ ఐపిఎస్ అధికారి. ఈయన 2016 నుండి స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ డైరెక్టర్‌గా బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. 1984లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్య తర్వాత ప్రధానమంత్రులకు ప్రత్యేక భద్రత కల్పించే బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. 1985 నుంచి ఎస్‌పిజి అమల్లోకి వచ్చింది. ప్రధానమంత్రి, మాజీ ప్రధానమంత్రులకు, వారి కుటుంబ సభ్యులకు భద్రత కల్పించే లక్ష్యంతో ఈ ఎస్‌పిజిని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ప్రధాని కుటుంబ సభ్యులకు కాకుండా.. కేవలం ప్రధాన మంత్రికి మాత్రమే ఎస్‌పిజి భద్రత కల్పిస్తోంది. సిన్హా గతంలో తిరువనంతపురంలో డిసిపి కమీషనర్, ఐజి, అడ్మినిస్ట్రేషన్ ఐజిగా పనిచేశారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం

- ఆరుగురి మృతి

చెన్నై : తమిళనాడులో బుధవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. సేలం-ఈరోడ్ హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడాది చిన్నారితో సహా ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈంగూర్‌కు చెందిన ఎనిమిది మంది సభ్యులు వ్యాన్‌లో పెరుంతురై వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు పక్కన ఆగి ఉన్న లారీని వ్యాన్ ఢీకొట్టింది. డ్రైవర్ నిద్రలో ఉండటమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులను సెల్వరాజ్, మంజుల, ఆరుముగం, పళనిసామి, పాపతితో పాటు ఏడాది వయసున్న చిన్నారిగా గుర్తించారు. వ్యాన్ డ్రైవర్ విఘ్నేష్, మరో ప్రయాణికురాలు ప్రియా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మతదేహాలను పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బిజెపిది అపరిపక్వ వైఖరి

- దేశాన్ని ఎందుకు అంతగా ద్వేషిస్తోందో?
- ప్రతిపక్ష కూటమి పేరు పెట్టడంతోనే ఇండియా పేరు మార్పు
- ఇది చాలా విచిత్రం..రాజ్యాంగ విధ్వంసం
- ఆర్టికల్ 1లో ఇండియా గురించి స్పష్టం
- మీడియాతో సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇండియా పేరును భారత్‌గా మార్చాలని బిజెపి చేసే ప్రయత్నం "అపరిపక్వత"తో ఉందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును "ప్రెసిడెంట్ ఆఫ్ భారత్" అని సూచించే జి20 విందు ఆహ్వానంపై వివాదం చెలరేగడంతో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి బుధవారం మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష కూటమి ఇండియా పేరును పెట్టడం పట్ల అధికార బిజెపి కలవరపడుతోందని విమర్శించారు. "ఇది చాలా విచిత్రం. మనకు రాజ్యాంగం ఉంది. శతాబ్దాలుగా దేశం ఎలా ప్రసిద్ధి చెందిందో తెలుసు. మన స్వతంత్ర భారతదేశాన్ని మనం వారసత్వంగా పొందాము. రాజ్యాంగంలోని మొదటి ఆర్టికల్‌లో 'ఇండియా అనే భారతదేశం రాష్ట్రాల యూనియన్' అని స్పష్టంగా పేర్కొందని అన్నారు.

"మా వైవిధ్యం, బహుళత్వం, ఇలా ప్రతిదీ రాజ్యాంగంలో చేర్చబడింది. బిజెపి ఈ మార్పు ఎందుకు చేస్తుంది? ఇండియా నామకరణం కింద లౌకిక ప్రతిపక్షం కలిసి రావడంతో బిజెపి నేతలు బాధపడుతున్నారా? అది వారి సమస్యా? బిజెపి భారతదేశాన్ని ఎందుకు అంతగా ద్వేషిస్తోందో మాకు తెలియదు" అని పేర్కొన్నారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), ఐఐటిలు, ఐఐఎంల పేర్లలో కూడా "ఇండియా" అనే పదం ఉందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ప్రెసిడెంట్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండియా అని ఉందని తెలిపారు. దాన్ని 'భారత్'గా మార్చడం వెనుక ఉద్దేశమేంటన్నది ప్రశ్నార్థకమే అని అన్నారు. "ఇండో-పసిఫిక్ ఉంది%్%% బిజెపి ఈ మార్పు దేని కోసం చేస్తుంది? " అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు తమ గ్రూపునకు ఇండియన్ నేషనల్ డెమోక్రటిక్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) అని పేరు పెట్టడంతోనే పేరు మార్చాలని ఆలోచనకు బిజెపి వచ్చిందని ఏచూరి దుయ్యబట్టారు. ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) అనే పదంతో కేంద్ర ప్రభుత్వం రెచ్చిపోతోందని విమర్శించారు. "ప్రతిపక్షాలు, లౌకిక శక్తులు ఇండియా పేరుతో ఒక్కటయ్యాయి. ఇండియాతో వాళ్ల (బిజెపి)కు ఇబ్బందిగా ఉంది. అందుకే వాళ్లు భారత్ అంటున్నారు. ప్రతిపక్షాలు 'ఇండియా' అనే సంక్షిప్త రూపాన్ని సృష్టిస్తే బిజెపి వణికిపోతుంది" అని సీతారాం ఏచూరి అన్నారు. ఇది భారత రాజ్యాంగ విధ్వంసమని, ఇది చాలా అపరిపక్వ ప్రతిస్పందన అని విమర్శించారు.

త్రిపురలో ప్రజాస్వామ్యం హత్య

- సిపిఎం పొలిట్‌బ్యూరో విమర్శ

న్యూఢిల్లీ : త్రిపురలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికలను రద్దు చేసి, కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో తాజాగా పోలింగ్ నిర్వహించాల్సిందిగా సిపిఎం పొలిట్‌బ్యూరో ఎన్నికల కమిషన్‌ను కోరింది. బాక్సానగర్, ధన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు బుధవారం జరిగిన ఎన్నికల్లో పూర్తి స్థాయిలో రిగ్గింగ్ జరిగిందని సిపిఎం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. బిజెపి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణలోనే ఈ రిగ్గింగ్ జరిగిందని విమర్శించింది. ఎన్నికల సందర్భంగా ఒక అసాధారణ భయోత్పాత పరిస్థితిని నెలకొల్పారు. సిపిఎం పోలింగ్ ఏజెంట్లపై భౌతిక దాడులకు దిగి, వారిని వారి విధులు నిర్వర్తించనీయకుండా అడ్డుకున్నారని పొలిట్‌బ్యూరో విమర్శించింది. బాక్సానగర్‌లో 16మంది, ధన్‌పూర్‌లో 19మంది సిపిఎం పోలింగ్ ఏజెంట్లు మాత్రమే బూత్‌ల్లోకి ప్రవేశించగలిగారు. కానీ వారిని కూడా భయభ్రాంతులకు గురి చేసి, విధులు నిర్వర్తించనీయకుండా అడ్డుకుని బయటకు పంపివేశారు. ఈ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్య ప్రక్రియకు ఒక ప్రహసనంగా మారాయని పొలిట్‌బ్యూరో విమర్శించింది. స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను దారుణంగా ఉల్లంఘించిన వారితో కుమ్మక్కైన అధికారులందరినీ తాజా ఎన్నికల సమయంలో ఎన్నికల విధుల్లో నియమించరాదని పొలిట్‌బ్యూరో పేర్కొంది. భయోత్పాతాన్ని సృష్టించడానికి బాధ్యులైన వారిని గుర్తించి, శిక్షించాలని కోరింది.

రామ్‌నాథ్ కోవింద్‌తో అమిత్ షా భేటీ

- మొదటి సమావేశంపై చర్చ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమిలి ఎన్నికలపై కమిటీకి నేతృత్వం వహిస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా, న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కలిశారు. బుధవారం నాడిక్కడ రామ్‌నాథ్ కోవింద్ నివాసంలో ఈ భేటీ జరిగింది. ప్రభుత్వం ప్యానెల్‌ను నోటిఫై చేసిన కొద్ది రోజుల ఈ భేటీ జరిగింది. దాదాపు గంటపాటు జరిగిన ఈ సమావేశాన్ని నేతలు మర్యాదపూర్వక భేటీ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఉన్నతస్థాయి కమిటీ తొలి సమావేశాన్ని నిర్వహించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసి వేదికను ఖరారుపై చర్చించారు. భవిష్యత్తులో సమావేశాలు కూడా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించవచ్చని తెలిపారు. ప్యానెల్‌కు సహాయం చేసే, సెక్రెటేరియల్ సహాయం అందించే అధికారులను నామినేట్ చేసే ప్రక్రియలో న్యాయ మంత్రిత్వ శాఖ ఉన్నట్లు తెలిసింది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించే అంశంపై పరిశీలించి సిఫార్సులు చేయడానికి ప్రభుత్వం శనివారం రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీకి నోటిఫై చేసింది. ఆదివారం న్యాయ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు రామ్‌నాథ్ కోవింద్‌కు సమాచారం అందించారు. కమిటీ ఆదేశం గురించి ఆయనను ఎలా వెళ్లాలనుకుంటున్నారో తెలుసుకోవాలని కోరారు. హోం మంత్రి అమిత్ షా, సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ కశ్యప్, 15వ ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్‌కె సింగ్, మాజీ సివిసి సంజయ్ కొఠారీ, రాజ్యసభలో మాజీ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ సభ్యులుగా ఉన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత అధీర్ రంజన్ చౌదరి కమిటీలో భాగం కావడానికి నిరాకరించారు. న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్నారు. కమిటీకి కార్యదర్శిగా న్యాయశాఖ కార్యదర్శిని నియమించారు.

బిజెపికి నేతాజీ మనవడు రాజీనామా

- పార్టీ తప్పుడు మార్గంలో వెళుతుందంటూ విమర్శ

కోల్‌కతా : బిజెపి తప్పుడు మార్గంలో వెళుతుందంటూ ఆ పార్టీకి నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనవడు చంద్రబోస్ బుధవారం రాజీనామా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో బిజెపితో కలిసి పనిచేయలేనని తేల్చిచెప్పారు. పక్షపాతం, ఓటు బ్యాంక్, విద్వేష రాజకీయాలకు బిజెపి పాల్పడుతుందని విమర్శించారు. ఈ మేరకు బిజెపి అధ్యక్షులు జెపి నడ్డాకు ఆయన లేఖ రాశారు. 'పార్టీ ఎలా పని చేయాలో అనేకసార్లు ప్రతిపాదనలు ఇచ్చాను. కానీ అవి అంగీకరించబడలేదు. బెంగాల్‌లో పార్టీ తప్పుడు మార్గంలో వెళుతుంది. రాష్ట్రంలో పార్టీకి ఉన్న అవకాశాలు నాశనమయ్యాయి' అని పేర్కొన్నారు. 'నేను బిజెపిలో చేరినప్పుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్, శరత్ చంద్రబోస్‌ల భావజాలాన్ని ప్రచారం చేయడానికి నన్ను అనుమతిస్తామని నాకు హామీ ఇచ్చారు. కానీ అలాంటిదేమీ జరగలేదు' అని లేఖలో బోస్ విమర్శించారు. 2016లో బిజెపిలో చంద్రబోస్ చేరారు.

'ప్రాజెక్ట్ నమన్' ప్రారంభం

న్యూఢిల్లీ : అమరవీరుల కుటుంబాల సంక్షేమం కోసం భారత ఆర్మీ ' ప్రాజెక్ట్ నమన్ 'ను ప్రారంభించింది. మాజీ సైనికులు, సైన్యంలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరుల కుటుంబాల సమస్యలను, ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మొదటగా ఢిల్లీ కంటోన్మెంట్‌లో ఈ తరహా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భారతీయ సైన్యానికి చెందిన డైరెక్టర్ ఆఫ్ ఇండియా ఆర్మీ వెటర్న్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు లిమిటెడ్, సి.ఎస్.ఇ.ఇ. - గవర్నెన్స్ ఇండియా లిమిటెడ్ దీనికోసం ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. ఇందులో సైనిక కుటుంబాలకు సౌకర్యాలు కల్పించడానికి ఒక కామన్ సర్వీస్ సెంటర్ ఉంటుంది. అంతేకాకుండా ఇది అన్ని ప్రభుత్వ కస్టమర్ సేవలను అందజేస్తుంది. అందులో సైనికుల కుటుంబాల పెన్షనర్ల ఖాతాలను కూడా నమోదు చేయవచ్చు.

మీకోసం

మూడు కప్పుల నీళ్లలో రెండు తమలపాకులు, నాలుగు మిరియాలు వేసి మరిగించి, తేనె కలిపి గోరువెచ్చగా తాగితే దగ్గు, ఛాతినొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

జీవన సౌరభం

విమర్శిస్తున్నారని, విఫలమయ్యామని ప్రయత్నాలు ఆపేసి ఉంటే ఇన్ని అద్భుతాలు సాధించేవాళ్లం కాదు..

చదువు

చదువంటే ... ఓ ఆయుధం
చదువుకుంటే ... ఆనందం
చదవకుంటే... అగాధం !

చదువంటే ... ఓ విజ్ఞానం
చదువుకుంటే ... జ్ఞానం
చదవకుంటే ... అజ్ఞానం !

చదువంటే ... ఓ కీర్తి
చదువుకుంటే ... స్ఫూర్తి
చదవకుంటే ... ఆర్తి!

చదువంటే ... ఓ సంస్కారం
చదువుకుంటే ...నమస్కారం
చదవకుంటే ... నిస్సారం !

చదువంటే ... ఓ దీపం
చదువుకుంటే ... రూపం
చదవకుంటే ... శాపం !

చదువంటే ... ఓ అనంతం
చదువుకుంటే ... ఉన్నతం
చదవకుంటే ... అంతం!

చదువంటే ... ఓ నిధి
చదువుకుంటే ... బుద్ధి
చదవకుంటే ... బూడిద!

చదువంటే ... ఓ జగతి
చదువుకుంటే ... సరస్వతి
చదవకుంటే ... దుర్గతి!

చదువంటే ... ఓ గురువు
చదువుకుంటే ... తరువు
చదవకుంటే ... కరువు!

దొంగిలించనిది చదువొక్కటే
తరిగిపోనిది చదువొక్కటే
అంతం లేనిది చదువొక్కటే !

- బి పాండురంగ

తేడాలు కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా ఉన్న ఈ రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం..

నేను గీసిన బొమ్మ



పవని కృష్ణ ప్రణయిని
5వ తరగతి
శ్రీ చైతన్య స్కూలు
చీరాల

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అమ్మ జ్ఞాపకంలో ఆరోగ్య సాగు..

ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉంటే ఆ ఇంటి మహిళకు ఎక్కడలేని ఆనందం. ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం చేస్తే.. ఆమె ఎంతలా తల్లడిల్లిపోతుందో.. అలా తన ఇంట్లో అమ్మ, పిన్ని, నానమ్మ చిన్న వయసులోనే అనారోగ్య కారణాలతో మరణించడం పద్మజను తీవ్రంగా కలిచివేసింది. ప్రసవం జరిగి, బిడ్డ పుట్టిన ఆనందంలో ఉండగా.. అమ్మ మరణం ఆమెను ఎంతో వేదనకు గురిచేసింది. తను పడిన బాధలు తన పిల్లలు పడకూడదని ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకునే ప్రయత్నంగా ప్రకృతిసేద్యం వైపు అడుగులు వేశారు. ఆ అడుగులే నేడు దేశ రాజధాని వైపు పయనించేలా చేశాయి. జాతీయ స్థాయిలో ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ (ఐసీసీఓఏ) సంస్థ ప్రకృతి సేద్యంలో విశేష ప్రతిభ చూపిన వారికి ప్రతి ఏడాది 'జైవిక్' పేరుతో అవార్డులు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ఈ ఏడాది మన రాష్ట్రానికి ఈ అవార్డును ప్రకటించింది. అందులో ఉత్తమ ప్రకృతి వ్యవసాయ మహిళా రైతు కేటగిరీలో బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం చిమటావారి పాలెంకు చెందిన 31 ఏళ్ల గనిపిశెట్టి పద్మజ సెప్టెంబరు 7న (నేడు) ఢిల్లీలో ఈ అవార్డును అందుకోనున్నారు.

దొడ్డా సాంబశివరావు, చిరంజీవి దంపతులకు పద్మజ తొలి సంతానం. 'వ్యవసాయ కుటుంబంలో పుట్టినా నాకు పెద్దగా వ్యవసాయ పనులు తెలియవు. తమ్ముడు, చెల్లితో ఆడుతూ పాడుతూ పెరిగాను. ఇంటర్‌లో ఉండగా పెళ్లి చేశారు. బాబు పుట్టిన కొన్ని రోజులకే అమ్మ కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోయింది. ఆమెకి అప్పటికే షుగర్ వుంది. 45 ఏళ్లు కూడా లేకుండా అమ్మ పోవడం నన్ను ఎంతో బాధించింది. నా చిన్నప్పుడే మా పిన్ని కూడా అనారోగ్య కారణాలతో 40 ఏళ్లకే చనిపోయింది. నేను 9వ తరగతి చదివేటప్పుడు నానమ్మకి క్యాన్సర్ సోకింది. నాన్నతో పాటు హాస్పటల్‌కి నేను కూడా వెళ్లాను. ఇతర కారణాలతో పాటు అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల కూడా ఈ వ్యాధి సోకుతుందని డాక్టరు ద్వారా తెలుసుకున్నాను. అప్పట్లో పెద్దగా పట్టించుకోలేదు. కానీ బిడ్డ పుట్టి ఆనందంలో ఉన్న నాకు, అమ్మ అవసరం బాగా ఉన్న ఆ రోజుల్లో ఆమె చనిపోవడంతో మళ్లీ డాక్టరు మాటలు మనసులో మెదిలాయి. అమ్మను తలచుకుని ఏడ్వని రోజు లేదు. అప్పటికి నాకు 18 ఏళ్లు. చెల్లి, తమ్ముడు ఇంకా చిన్న పిల్లలు' అంటూ పద్మజ చెబుతున్నప్పుడు భావోద్వేగంతో ఆమె గొంతు జీరబోయింది.

మొదటి ప్రయాణం ఇంటి నుండే

వరుస మరణాలతో

కుదేలైన పద్మజ తన ఆరోగ్యంతో పాటు ఇంటిల్లిపాది ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని నిర్ణయించుకున్నారు. మొదట్లో ఇంటి పెరట్లో కాయ గూరలు, ఆకుకూరల మొక్కలు పెంచుకోవడం మొదలుపెట్టారు. సాధారణంగా గ్రామాల్లో ఇలాంటి దృశ్యాలే కనిపిస్తాయి. ప్రతి ఒక్కరూ ఇదే పద్ధతి అవలంబిస్తారు. కానీ 2016లో ప్రకృతి వ్యవసాయంపై విస్తృత ప్రచారం సాగుతున్న రోజుల్లో గ్రామానికి వచ్చిన ప్రకృతి వ్యవసాయ ప్రచార కార్యకర్తలను పద్మజ కలిశారు. వారి ద్వారా సేంద్రియ వ్యవసాయ సాగు గురించి తెలుసుకుని ఆ దిశగా అడుగులు వేశారు.

90 శాతం పొలం పనులు ఒక్కదాన్నే..

'ఇంట్లో ఉండే వ్యర్థ పదార్థాలు, పశువుల వ్యర్థాలతో పంటలు కూడా పండించవచ్చని అప్పటికే నేను విన్నాను. అయినా ఎలా చేయాలో తెలియదు. గ్రామానికి వచ్చిన కార్యకర్తల ద్వారా విశ్రాంత ఐఎఎస్ అధికారి విజయ్‌కుమార్ గారు పరిచయమై ఆయన క్లాసులకు వెళ్లేదాన్ని. మొదట ఒక అర ఎకరం పొలంలో సేద్యం మొదలుపెట్టాను. అందుకు నా భర్త రామకృష్ణ కూడా అంగీకరించారు. ఆయన ఇచ్చిన మద్దతుతో ఆ ఏడాది బాగా కష్టపడి దిగుబడి సాధించాను. చిన్నప్పుడు పొలం వైపే చూడని నేను 90 శాతం పనులు ఒక్కదాన్నే చేసుకోవడం మొదలు పెట్టాను. మొదట నా కుటుంబం ఆరోగ్యం కోసం ఈ పని ప్రారంభించినా రానురాను అది ఊరందరికీ చేరింది. ఊళ్లో చాలామంది ఇప్పుడు ప్రకృతి సాగు చేస్తున్నారు. ఈ సాగు పద్ధతిలో దిగుబడికి సంబంధించి పరిమితులు ఉన్నప్పటికీ– రసాయనిక ఎరువులు వాడకం లేకపోవడం ఒక మేలుగా రైతులు భావించారు.

మార్కెట్‌కి వెళ్లి అమ్మింది లేదు..

అర ఎకరంతో మొదలైన నా ప్రయాణం ఇప్పుడు రెండున్నర ఎకరాలకు చేరింది. ప్రధాన పంటతో పాటు అంతర పంటలు వేయడం వల్ల అధిక దిగుబడి కూడా వస్తోంది. సేంద్రియ పద్ధతుల్లో పండించిన శనగలు, మొక్కజొన్న, ఆవాలు, కూరగాయలు, ఆకు కూరల పంటలను మార్కెట్‌కి తీసుకెళ్లి అమ్మింది లేదు. కావాల్సిన వారు నేరుగా పొలానికి వచ్చి తీసుకుంటారు. అప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. నా కుటుంబంతో పాటు ఎన్నో కుటుంబాలు ఆరోగ్యంగా ఉండటంలో నేను కూడా భాగమవుతున్నాను' అంటూ తన ప్రయాణ విశేషాలను ఆమె పంచుకున్నారు.

వ్యవసాయ కుటుంబంలో పుట్టడం గర్వంగా ఉంది

'వ్యవసాయ కుటుంబంలో పుట్టడం నా

అదృష్టం. ఈ అవకాశం అందరికీ దొరకదు. రైతు బిడ్డగా, రైతు మహిళగా పిలిపించుకోవడం ఎంతో గర్వంగా ఉంటుంది. అమ్మ దూరమైన నాకు నేల తల్లే అమ్మ. నేలను పచ్చగా చూసుకుంటే ఎన్నో లాభాలు తెచ్చిపెడుతుంది. వ్యవసాయం దండగ అనే వారు నేటికీ ఉన్నారు. కానీ, ప్రోత్సాహం ఉంటే నేలలో బంగారం పండించడం రైతులకే సాధ్యం. ఇప్పుడు చాలామందికి సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించడం అలవాటైంది. ఇంటి పెరట్లో, మిద్దెపై అవకాశమున్న ప్రతి ఒక్కరూ ఇటువైపు వస్తున్నారు. భూమి లేకపోతే మనుషులు లేరు.. ఆరోగ్యకర పంటలు పండాలంటే నేల సారవంతంగా ఉండటం చాలా ముఖ్యం' అంటూ ఆమె చెబుతున్నప్పుడు వ్యవసాయంపై ఆమె మక్కువ కనపడుతోంది.

కుటుంబ ప్రోత్సాహంతోనే..

ఇంటి అవసరాల కోసం మొదలుపెట్టిన పద్మజ ప్రయాణంలో జాతీయ స్థాయి అవార్డు అందుకునే స్థాయికి ఎగబాకడంలో కఠోర శ్రమ దాగుంది. 'ఇదంతా ఒక్కరోజులో వచ్చింది కాదు. కుటుంబం, పిల్లలు సహకారంతోనే నేను ఇది సాధించాను. అవార్డు రావడంపై నాన్న ఎంతో సంబరపడి పోతున్నాడు' అంటూ తను సాధించిన ప్రగతిని కుటుంబ విజయంగా చెప్పడంతో ఆమెలో ఓ అమ్మ, కూతురు, భార్య కనిపిస్తోంది.

విత్తనాలను కూడా పద్మజ తనదైన శైలిలో భద్రపరుస్తున్నారు. మట్టి కుండల్లో విత్తనాలు వేసి పైన పల్చని వస్త్రంతో కప్పివుంచడం, పొడిబారిన నేలలో వేసే వీలుగా సీడ్ బాల్స్ చేయడం, జీవామృతం, ఘనామృతం తయారుచేయడం వంటివన్నీ స్వయంగా నిర్వహిస్తున్నారు. ఆరు నెలలకు సరిపడా సేంద్రియ ఎరువును తయారు చేసుకుని కావాల్సిన వారికి కూడా పంపిణీ చేస్తున్నారు. తనతో పాటు, ఊరు, దేశం బాగుపడాలని కోరుకునే వ్యక్తులు రైతులే. ఇప్పుడు యువ రైతు పద్మజ చేస్తున్న ప్రయాణం కూడా అదే. ఈ మార్గంలో ఆమె మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుందాం.

- జ్యోతిర్మయి

చిన్న పట్టణాల్లోనూ స్టాక్ మార్కెట్లపై ఆసక్తి

- స్థానిక భాషల్లోనూ సేవలు
- టెక్నాలజీపై ఏటా రూ.1,000 కోట్ల పెట్టుబడులు
- ఎన్ఎస్ఇ సిఇఒ ఆశిష్ కుమార్ వెల్లడి

ముంబయి : స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు చిన్న పట్టణాల్లోని ఇన్వెస్టర్లు కూడా ఆసక్తి చూపుతున్నారని నేషనల్ స్టాక్ ఎక్సేంజీ (ఎన్ఎస్ఇ) మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) ఆశిష్ కుమార్ చౌహాన్ అన్నారు. ఒకప్పుడు మెట్రో సిటీలు, పెద్ద నగరాల్లోని వారు మాత్రమే స్టాక్ మార్కెట్లపై అవగాహన, ఆసక్తి కలిగి ఉండేవారన్నారు. ఇటీవలి కాలంలో చిన్న పట్టణ ప్రాంతాల్లోని మదుపర్లు ఎక్కువగా నమోదయ్యారని వెల్లడించారు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్ఇ ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆశిష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ట్రేడింగ్ కోసం రిజిస్టర్ చేసుకున్న మదుపర్లలో 60 శాతం మంది 50 పెద్ద నగరాలకు బయటి ప్రాంతాలు, పట్టణాల్లోని వారే ఉన్నారన్నారు. మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం తాము స్థానిక భాషల్లోనూ ఎన్ఎస్ఇ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తేనున్నామన్నారు. ఇప్పటికే హిందీ, మరాఠీ భాషలను ప్రారంభించామని.. భవిష్యత్తులో ఎక్కువగా మాట్లాడే తెలుగు, తమిళం, కన్నడ ఇతర భాషల్లోనూ ఎన్ఎస్ఇని అందుబాటులోకి తేనున్నామన్నారు. ప్రతి రోజూ సగటున 2–3 కోట్ల మంది ఎన్ఎస్ఇ వెబ్‌సైట్‌ను సందర్శిస్తున్నారని తెలిపారు. ప్రతి రోజు 1,300 నుంచి 1,500 కోట్ల మేర లావాదేవీలు జరుగుతున్నాయ న్నారు. మార్కెట్ పరిస్థితులు, నియమ నిబంధనలకు అనుగుణంగా పవర్, కార్బన్ క్రెడిట్ విభాగాల్లో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను ప్రవేశపెట్టే యోచనలో ఉన్నామన్నారు. టెక్నలాజీ పరంగా మరింత అప్‌గ్రేడ్ కావడానికి వీలుగా ప్రతీ ఏడాది రూ.1,000 కోట్ల నుంచి రూ.1,500 కోట్ల వరకు వ్యయం చేయనున్నామన్నారు.

లోకేష్ పాదయాత్రకు ఆదరణ లేదు : టిజెఆర్ సుధాకర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రకు ప్రజల నుండి ఆదరణ లేదని వైసిపి ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్ బాబు విమర్శించారు. అందుకనే ఆయన రాత్రివేళ యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా లోకేష్ యాత్రకు స్పందన లభించడం లేదని, అందువల్లే దాడుల డ్రామా ఆడుతున్నారని టిజెఆర్ ఆరోపించారు. ప్రజలు నిద్రపోయే సమయంలో యాత్ర సాగించాల్సిన అవసరమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు మాఫియా డాన్‌గా వ్యవహరిస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఐటి నోటీసులపైనా చంద్రబాబు తేలుకుట్టిన దొంగలా వున్నాడని పేర్కొన్నారు.

లోన్ యాప్ వేధింపులకు యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం జిల్లా)

లోన్ యాప్ వేధింపులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రకాశం జిల్లా పొదిలిలో బుధవారం చోటుచేసుకుంది. పోతవరం గ్రామానికి చెందిన బోనం అశోక్‌రెడ్డి (23) తన తండ్రితో కలిసి పొదిలిలో ఐరన్ ఫౌండ్రీ నడుపుతున్నారు. యాక్సిస్ బ్యాంకు, చోళ మండలం ఫైనాన్స్‌లో అశోక్‌రెడ్డి రుణాలు తీసుకున్నారు. ఈ రుణాలు చెల్లించాలని గత కొద్ది రోజులుగా సంబంధిత సంస్థల ఏజెంట్లు వేధింపులకు గురిచేస్తున్నారు. వేధింపులు అధికం కావడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున అశోక్‌రెడ్డికి ఫైనాన్స్ నిర్వాహకుల నుంచి ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఫైనాన్స్ సంస్థల రుణ వేధింపుల వల్లే అశోక్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు అతని సన్నిహితులు తెలిపారు.

మేకప్ కోసం వచ్చి చోరీ

- నగలు, నగదు దొంగతనం
- నలుగురు మహిళలు అరెస్టు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మేకప్ చేయించుకుంటామంటూ వచ్చి మహిళా బ్యూటీషియన్ ఇంట్లో నలుగురు మహిళలు చోరీకి పాల్పడ్డారు. బ్యూటీషియన్ నిర్వాహకులు మెడలోని నగలు, ఆమె ఇంట్లోని నగదు దోచుకున్నారు. చోరీకి పాల్పడిన నలుగురు మహిళలను ప్రకాశం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.11 లక్షల విలువైన బంగారంతోపాటు కొంత నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎస్‌పి మల్లికాగర్గ్ తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ఒంగోలులోని శ్రీకృష్ణనగర్‌లో షేక్ రజియా అనే మహిళ ఇంటి వద్దే బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్నారు. మంగమూరు రోడ్డుకు చెందిన ముంద్రు లక్ష్మినవత, కరణం మోహన దీప్తి, అపర్ణతోపాటు మరో మహిళ మంగళవారం మధ్యాహ్నం బ్యూటీపార్లర్‌కు వచ్చి మేకప్ చేయాలని కోరారు. మొదట ఇద్దరు మహిళలు ఐబ్రోస్ చేయించుకున్నారు. మూడో మహిళకు పెడిక్యూర్ చేస్తుండగా.. బ్యూటీషియన్‌పై యాసిడ్ తరహా ద్రావకం చల్లి దాడి చేశారు. రజియా స్పృహ కోల్పోగానే ఆమె మెడలోని నగలు, బీరులో ఉంచిన రూ.40 వేల నగదు దోచుకుని పరారయ్యారు. కాసేపటికి తేరుకున్న రజియా ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి చేధించారు. ముగ్గురు మహిళలతో పాటు చోరీకి సహకరించిన మరో మహిళను అరెస్టు చేశారు. కేసును చేధించిన డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి, సిఐ భక్తవత్సలరెడ్డి, పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.



మహేశ్‌తో కలిసి సినిమా చూడాలనుంది : షారుఖ్

షారుఖ్ ఖాన్–మహేశ్ బాబు మధ్య జరిగిన ఓ సరదా సంభాషణ తాజాగా సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. 'జవాన్' చిత్రాన్ని ఉద్దేశిస్తూ వీరిద్దరూ సోషల్ మీడియాలో పోస్టులను పంచుకున్నారు. షారూక్ నటించిన 'జవాన్' చిత్రాన్ని కుటుంబంతో కలిసి తాను చూడాలనుకుంటున్నట్లు మహేశ్‌బాబు తాజాగా ట్వీట్ చేశారు. ఈ చిత్రం పెద్ద విజయం అందుకోవాలంటూ ఆయన కోరుకున్నారు. దీనిపై షారుఖ్ స్పందిస్తూ మహేశ్‌తో కలిసి తాను కూడా సినిమాను చూడాలని భావిస్తున్నట్లుగా పేర్కొన్నారు. 'థ్యాంక్యూ సో మచ్ మై ఫ్రెండ్. 'జవాన్' నీకు నచ్చుతుందని అనుకుంటున్నా. నువ్వు ఎప్పుడు ఈ సినిమా చూడాలనుకుంటున్నావో చెబితే.. నేనూ నీతో కలిసి సినిమాకి వస్తా. నీకు, నీ కుటుంబానికి నా ప్రేమపూర్వక అభినందనలు" అని షారుఖ్ ట్వీట్ చేశారు.

సెమీస్‌కు బొప్పన్న జోడి

సబలెంక, ముఛోవా.. జకోవిచ్, షెల్టన్ కూడా.. యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో భారత సీనియర్ ఆటగాడు రోహన్ బొప్పన్న సెమీస్‌కు చేరాడు. మంగళవారం రాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్లో బొప్పన్న-ఎబ్డెన్(ఆస్ట్రేలియా) జంట 7-6 (12-10), 6-1తో అమెరికాకు చెందిన లామన్స్-విత్రోలపై పోరాడి నెగ్గారు. తొలి సెట్‌ను టై బ్రేక్‌లో పోరాడి నెగ్గిన బొప్పన్న జంట.. రెండో సెట్‌ను ఏకపక్షంగా చేజిక్కించుకొన్నారు. 5వ సీడ్‌గా బరిలోకి దిగిన ఇండో–ఆసీస్ జోడీ ఫ్రాన్స్‌కు చెందిన అన్‌సీడెడ్ మహట్–హెర్బెట్‌లతో తలపడనున్నారు. ఇక మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి చెక్ రిపబ్లిక్‌కు చెందిన 10వ సీడ్ కరోలినా ముఛోవా, 2వ సీడ్ రష్యాకు చెందిన ఆర్యానా సబలెంకా ప్రవేశించారు. ప్రవేశించింది. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ముఛోవా 6-0, 6-3తో 30వ సీడ్ సిర్టీ(జర్మనీ)పై, సబలెంక 6-1, 6-4తో 23వ సీడ్, చైనాకు చెందిన జంగ్‌ను చిత్తుచేసి సెమీస్‌కు చేరారు.

జకో జోరు..

పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి 2వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్, అమెరికా సంచలనం షెల్టన్ ప్రవేశించారు. క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ 6-1, 6-4, 6-4తో అన్‌సీడెడ్ ఫ్రిట్జ్(అమెరికా)పై, షెల్టన్ 6-2, 3-6, 7-6(9-7), 6-2తో సహచర ఆటగాడు, 10వ సీడ్ టఫీపై నెగ్గారు.

పాకిస్తాన్ సునాయాసంగా..

బంగ్లాపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు

లాహోర్: ఆసియాకప్ సూపర్-4లో భాగంగా బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ సునాయాసంగా విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్.. పాక్ పేసర్ల ధాటికి 38.4 ఓవర్లలో 194పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో పాకిస్తాన్ జట్టు 39.3 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 194పరుగులు చేసి విజయం సాధించింది. తొలుత బంగ్లా జట్టు 10 ఓవర్లలో 50 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత కెప్టెన్ షకీబ్ అల్ హసన్ (53), రహీమ్ (64) అర్ధసెంచరీలతో మెరిసారు. రవూఫ్‌కు నాలుగు, నసీమ్ షాకు మూడు, షాహిన్ అఫ్రిది, అష్రాఫ్, ఇఫ్తికార్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో పాకిస్తాన్ ఓపెనర్ ఇఫ్తికార్(78), రిజ్వాన్(63) రాణించారు. బాబర్(17), ఫకర్(20) నిరాశపరిచారు. తస్కిన్, అస్లామ్, మెహిదీ హసన్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రవూఫ్‌కు దక్కింది. ఆదివారం జరిగే సూపర్-4 రెండో మ్యాచ్‌లో పాక్ జట్టు భారత్‌తో తలపడనుంది.

వన్డే ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా జట్టు ఇదే..

సిడ్నీ: ఐసిసి వన్డే ప్రపంచకప్ టోర్నీలో ఆడే ఆస్ట్రేలియా జట్టును ఆ దేశ క్రికెట్‌బోర్డు బుధవారం వెల్లడించింది. సిఎ ప్రకటించిన 15మంది ఆటగాళ్ల జట్టులో యువ ఆల్‌రౌండర్ ఆర్డొన్ హర్డీ, తన్వీర్ సంఘాతోపాటు పేసర్ నాథన్ ఎల్లిస్‌కు చోటు దక్కలేదు. అలాగే టెస్టు స్పెషలిస్టు మార్నస్ లబూషేన్ పేరును పరిశీలించని సిఎ.. పేసర్ అబాట్‌కు చోటు కల్పిం చింది. కెప్టెన్‌గా పాట్ కమిన్స్ ఎంపికయ్యాడు. ఈనెల సెప్టెంబరు 28వరకు ప్రపంచకప్ జట్టులో మార్పులు చేసుకు నేందుకు అవకాశం ఉంది. ఇక భారత్ వేదికగా అక్టోబరు 5 నుంచి మెగా ఈవెంట్ మొదలుకానుండగా.. అక్టోబరు 8న టీమిండియాతో ఆసీస్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఆసీస్ జట్టు ఐదుసార్లు ప్రపంచకప్‌ను చేజిక్కించుకుంది. **జట్టు: కమిన్స్(కెప్టెన్), స్మిత్, క్యారీ, ఇంగ్లిస్, అబాట్, అగర్, గ్రీన్, హేజిల్‌వుడ్, హెడ్, మిచెల్ మార్ష్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, వార్నర్, జంపా, స్టార్క్.**

తొలిరౌండ్‌లోనే చిరాగ్-సాత్విక్ ఓటమి

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఛాంగ్జౌ(చైనా): చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లందరూ తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలిరౌండ్ పోటీలో చిరాగ్‌శెట్టి–సాత్విక్ సాయిరాజ్ జోడీ 17-21, 21-11, 17-21తో ఇండోనేషియాకు చెందిన ఫికర్–మౌలానా చేతిలో పోరాడి ఓడారు. తొలి గేమ్‌ను ఓడిన భారత డబుల్స్ జోడీ.. రెండో గేమ్‌ను చేజిక్కించుకుంది. పోటాపోటీగా సాగిన మూడో గేమ్ చివర్లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో మహిళల డబుల్స్ జోడీతోపాటు సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, ప్రియాంశు ఓటమిపాలైన సంగతి తెలిసిందే. చైనా ఓపెన్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసినట్లయ్యింది.

ఆసియా టిటి ఛాంపియన్‌షిప్ పురుషుల జట్టుకు కాంస్యం

ప్యోంగ్‌ఛాంగ్(ద.కొరియా): 26వ ఐటిటిఎఫ్ ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు కాంస్య పతకంతో సరిపుచ్చుకుంది. మంగళవారం రాత్రి జరిగిన సెమీఫైనల్లో 3వ సీడ్ భారత్ 0-3 తేడాతో 2వ సీడ్ చైనీస్ తైపీ చేతిలో ఓటమిపాలైంది. తొలి సింగిల్స్‌లో శరత్ కమల్ 6-11, 6-11, 9-11తో చౌ చింగ్ యంగ్ చేతిలో, రెండో సింగిల్స్‌లో జి. సాథియాన్ 5-11, 6-11, 10-12తో లిన్–యన్–జు చేతిలో వరుససెట్లలో ఓడారు. ఇక మూడో సింగిల్స్‌లో హర్మీత్ దేశాయ్ 6-11, 7-11, 11-7, 9-11తో కో-ఛెంగ్-జూ చేతిలో పోరాడి ఓడాడు. హర్మీత్ దేశాయ్ మ్యాచ్ మినహా మిగతా మ్యాచ్‌లన్నింటిలోనూ ఏకపక్ష పోటీలో భారత టిటి ప్లేయర్స్ ఓటమిపాలయ్యారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 63వ స్థానంలో దేశాయ్.. 33వ ర్యాంకర్ కావో–చెంగ్‌-కు ముచ్చెమటలు పట్టించాడు. సెమీస్‌లో ఓడిన జట్టుకు కాంస్య పతకాలు దక్కనున్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68